మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 19 వెల - రూ 5:00
Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# తెలంగాణ గవర్నర్‌గా రాధాకృష్ణన్ ప్రమాణం

**హాజరైన సిఎం రేవంత్, పలువురు మంత్రులు**




2లో..

# పంటనష్టానికి పరిహారం

**- నివేదికలు అందగానే రూ.10వేలు సాయమందిస్తాం**
**- రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాం: తుమ్మల**
**- ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయడం తగదని హితవు**



**హైదరాబాద్, మార్చి 20 (ప్రజా మంటలు):** అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తి చిత్తశుద్ధితో ఉందని ఓ ప్రకటనలో వివరించారు. పదేళ్లపాటు అస్తవ్యస్త విధానాలతో రైతులను అగమ్యగోచరంగా చేశారని.. ఇప్పుడు రైతుల కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై కొందరు అనవసర విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.పదేళ్లలో ఏనాడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని వాళ్లు ఇవాళ విడ్డూరంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కేవలం ఎన్నికలకు ముందు రూ.150 కోట్లు మాత్రమే పరిహారంగా ఇచ్చారని.. రెండో మారు జీవో మాత్రమే ఇచ్చి చేతులు దులుపేసుకున్నారని ఆరోపించారు. మూడోసారి కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదని దుయ్యబట్టారు. గత మే నెల వరకు కూడా రైతుబంధు నిధులు జమ చేసిన నేతలు.. ఇవాళ తమను తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తుమ్మల అభ్యంతరం వ్యక్తం చేశారు.

# మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే

**- ప్రధాని మోదీ**



**దిల్లీ (ప్రజా మంటలు):** దేశాభివృద్ధిలో అంకుర సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. మూడోవిడత అధికారంలోకి వచ్చాక భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.దిల్లీలోని భారత మండపంలో 'స్టార్టప్ మహాకుంభ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు."1.25 లక్షల స్టార్టప్‌లు, 110 యూనికార్న్‌లతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించింది. సరైన సమయంలో కచ్చితమైన నిర్ణయాలతో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించాం. దేశ యువత స్టార్టప్‌ల ద్వారా వినూత్న ఆలోచనలతో సరికొత్త మిగతా 2లో..

## వచ్చే ఐదేళ్ల లక్ష్యాలపై దృష్టిసారించండి

- వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత శ్రద్ధవహించండి
- మంత్రిత్వశాఖలను సూచించిన ప్రధాని మోదీ

2లో..

# వైద్యారోగ్యశాఖలో కొలువుల జాతర

**- 5348 పోస్టుల భర్తీకి పచ్చజెండా - ఈనెల 16నే ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల**

**హైదరాబాద్, మార్చి 20 (ప్రజా మంటలు):** తెలంగాణలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలోని 5,348 పోస్టుల భర్తీకి సర్కారు పచ్చజెండా ఊపింది. ఈమేరకు ఈనెల 16నే ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల చేశారు.ప్రజారోగ్యం, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్ జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు జారీ చేశారు. వైద్యారోగ్య సర్వీసుల నియామక బోర్డు ద్వారా నేరుగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని సూచించారు. ఇందుకోసం స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి తీసుకోవాలని చెప్పారు. ఆయా వివరాల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు.



# నిందితులను ఎక్కువ కాలం జైళ్లోనే ఉంచాలని చూస్తున్నారా?

**- ఈడీ తీరుపై సుప్రీం అసహనం**




**న్యూఢిల్లీ (ప్రజా మంటలు):** మనీ లాండరింగ్ కేసుల్లో విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుసరిస్తోన్న తీరుపై భారత సర్వోన్నత న్యాయస్థానం విచారం వ్యక్తం చేసింది.నిందితులకు డీఫాల్ట్ బెయిల్ నిరాకరించేందుకు వరుసగా అనుబంధ ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైళ్లోనే ఉంచే ఈ పద్ధతి న్యాయస్థానాన్ని ఇబ్బందికి గురిచేస్తోందని పేర్కొంది." విచారణ పూర్తయ్యేంతవరకు నిందితులను అరెస్టు చేయకూడదనేది డీఫాల్ట్ బెయిల్ ముఖ్య ఉద్దేశం. మిగతా 2లో..

# సొంతగూటికి తమిళిసై..

**- తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి**
**- మళ్లీ భాజపాలో చేరిన మాజీ గవర్నర్**

**చెన్నై (ప్రజా మంటలు):** తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గవర్నర్ పదవితో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆమె..భారతీయ జనతా పార్టీలో చేరారు. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సమక్షంలో బుధవారం పార్టీ కండువా కప్పుకొన్నారు. గతంలో భాజపా తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన సంగతి తెలిసిందే.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూసిన తమిళిసై మరోసారి ఎన్నికల బరిలో నిలవనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజా సేవ చేసేందుకే తిరిగి ప్రత్యక్ష



రాజకీయాల్లో అడుగుపెట్టినట్లు చెప్పారు. త్వరలో భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. తమిళనాడులో కమలం వికసిస్తుందని పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో తన ఉనికిని విస్తరించాలని భావిస్తున్న భాజపాకు.. తమిళిసై రాక కొత్త ఉత్సాహాన్నిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.తమిళిసై రాకను పార్టీ అధ్యక్షుడు అన్నామలై స్వాగతించారు. మిగతా 2లో..

# తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**- ఎప్రిల్ 19న జరిగే ఎలక్షన్లకు నామినేషన్లు షురూ**
**- 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు**
**- మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు**

**న్యూఢిల్లీ (ప్రజా మంటలు):** ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో బుధవారం నుంచే నామినేషన్‌ల ప్రక్రియ మిగతా 2లో..





# నా ఫోన్‌కాల్ రికార్డు చేశారు

**- దానిని ప్రతిపక్ష ఎమ్మెల్యేకు పంపారు**
**- హనుమకొండ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి**
**- సీఎస్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు**

**హైదరాబాద్ (ప్రజా మంటలు):** హనుమకొండ ఆర్డీవోపై సీఎస్ శాంతికుమారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. తన ఫోన్‌కాల్ రికార్డు చేసి ప్రతిపక్ష ఎమ్మెల్యేకు పంపించారని అందులో పేర్కొన్నారు.వెంటనే ఆర్డీవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కరవు వచ్చిందంటూ ప్రతిపక్ష నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. పంట నష్టంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు.



# ప్రజా నాడి




# తెలంగాణలో మరోసారి ఎన్డీఎస్ఏ కమిటీ పర్యటన

**- ఇంజినీర్లతో చైర్మన్ అయ్యర్ భేటీ**
**- మూడు రోజుల పాటు కొనసాగునున్న పర్యటన**



**హైదరాబాద్ (ప్రజా మంటలు):** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ రాష్ట్రంలో మరో దఫా పర్యటిస్తోంది.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకుంది. మూడు ఆనకట్టల బాధ్యతలు నిర్వహించిన ఇంజినీర్లతో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో సమావేశమైంది. గత పర్యటనలో క్షేత్రస్థాయిలో ఆనకట్టలను పరిశీలించిన కమిటీ.. కొంత మంది ఇంజినీర్లతోనూ సమావేశమైంది. ఆనకట్టల

# రైతులంటే ఎందుకంత చిన్నచూపు?

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్ (ప్రజా మంటలు):** రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదని.. వడగళ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. దిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా? వాళ్ల ఆర్తనాదాలు వినిపించవా? ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న శ్రామికులపై కనికరం లేదా? సీట్లు, ఓట్ల పంచాయితీ తప్ప.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా అంటూ విమర్శలు సంధించారు. ప్రజాపాలన అంటే మిగతా 2లో..

# ఎన్నికల వేళ 'ఉచితాల'పై విచారణకు సుప్రీం ఒకే..



**న్యూఢిల్లీ (ప్రజా మంటలు):** సార్వత్రిక ఎన్నికలకు తొలి నోటిఫికేషన్ విడుదలైన రోజే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇస్తున్న తీరుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. త్వరలోనే దీన్ని లిస్ట్ చేస్తామని పేర్కొంది. ఉచిత హామీలు ప్రకటించే పార్టీల గుర్తులు, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేందుకు ఎన్నికల సంఘం తన అధికారాలను ఉపయోగించేలా ఆదేశించాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ గవర్నర్‌గా రాధాకృష్ణన్ ప్రమాణం

### నూతన గవర్నర్‌గా రాధాకృష్ణన్ బాధ్యతలు

### - ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే

### - హాజరైన సీఎం రేవంత్, పలువురు మంత్రులు

**హైదరాబాద్, మార్చి 20 (ప్రజా మంటలు):**
తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్.. అదనంగా తెలంగాణ బాధ్యతలు స్వీకరించారు. రాధాకీస్ణన్ తెలంగాణకు ఇప్పుడు మూడో గవర్నర్ కావడం విశేషం. ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టిన ముగ్గురు కూడా తమిళనాడు వారే కావడం మరో విశేషం. తమిళిసై రాజీనామా నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయన్ను నియమించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు భాజపా తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు భాజపా సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్లా పూర్తిస్థాయి గవర్నర్లను నియమించేంత వరకూ సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు తెలంగాణ గవర్నర్లుగా పనిచేసిన ఈఎస్ఎల్ నరసింహన్, తమిళిసై సౌందరరాజన్‌తోపాటు ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్.. ముగ్గురూ తమిళనాడు వారే కావడం గమనార్హం.



## మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే

### – ప్రధాని మోదీ

ఆవిష్కరణలు చేపట్టి పెట్టుబడులను ఆకర్షించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగారు. దేశంలో 45 శాతం స్టార్టప్‌లను నడిపిస్తున్నది మహిళలే. మధ్యంతర బడ్జెట్‌లో పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.లక్ష కోటి బడ్జెట్ కేటాయించడం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని రాజకీయాల్లో స్టార్టప్‌లపై ఛలోక్తులు విసిరారు. "చాలా మంది స్టార్టప్‌లను ప్రారంభిస్తారు. రాజకీయాల్లో ఇవి ఎక్కువ. ప్రతిసారీ కొత్త స్టార్టప్‌లు ప్రారంభించాల్సిందే. కానీ, మీ స్టార్టప్‌లకు రాజకీయాల్లో వాటికి చాలా వ్యత్యాసం ఉంది. మీరు ప్రయోగాత్మకంగా వ్యవహరిస్తారు. ఒక ఆలోచన కార్యరూపం దాల్చకుంటే మరో ఐడియాతో ముందుకు సాగుతారు" అని మోదీ పేర్కొన్నారు.

## వచ్చే ఐదేళ్ల లక్ష్యాలపై దృష్టిసారించండి

**- వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత శ్రద్ధవహించండి**

**- మంత్రిత్వశాఖలను సూచించిన ప్రధాని మోదీ**

రానున్న ఐదేళ్లలో ఏటా వారి శాఖల్లో సాధించాలనుకొన్న లక్ష్యాలు ఏమిటో తెలియజేయాలని ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులను కోరినట్లు తెలుస్తోంది.దీనికి సంబంధించిన ప్రభుత్వ పత్రం ఒకటి ఆంగ్ల వార్తా సంస్థ చేతికి అందింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ప్రభుత్వంలోని కీలక అధికారులకు ప్రధాని సూచనలు చేస్తూ దీనిని పంపారు.భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి అనుగుణంగా రానున్న ఐదేళ్ల కార్యాచరణను తెలియజేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను కోరుతూ మార్చి 11న ప్రధాని కార్యాలయం ఓ పత్రాన్ని పంపింది. వారిచ్చే సమాచారం ఆధారంగా కొత్త ప్రభుత్వం తదుపరి 100 రోజుల ప్రణాళిక ఉంటుందని అందులో పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత దృష్టిపెట్టాలని అందులో సూచించారు. ముఖ్యంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలై కొత్త ప్రభుత్వం ఏర్పడేలోపు కాలాన్ని సద్వినియోగం చేసుకొని ఈ ప్లాన్లు సిద్ధం చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఇందుకు అవసరమైన వివిధ పారిశ్రామిక వర్గాలను కూడా కలుసుకోవాలని సూచించారు. నూరుశాతం పిల్లలు పాఠశాలలకు వెళ్లడం, టీకాలు వేయించుకోవడం వంటి అంశాలను కూడా అందులో ప్రస్తావించారు.గత అక్టోబర్‌లో అధికారులకు వెళ్లిన పత్రంలో కూడా పలు అంశాలను ప్రస్తావించారు. గ్రామీణప్రాంతాల్లో ఆర్థిక వృద్ధి కోసం కోల్డ్ చైన్ లాజిస్టిక్ వ్యవస్థలు, ఆర్గానిక్ వ్యవసాయానికి అవసరమైన వసతుల కల్పన, 2030 నాటికి సమష్టి వ్యవసాయం పెంచడంపై ప్రణాళికలు సిద్ధం చేసిందని సదరు ఆంగ్లవార్తా సంస్థ పేర్కొంది. వ్యవసాయోత్పత్తిని పెంచడం, వ్యవసాయేతర రంగాల్లోకి ఉద్యోగాలను మళ్లించడం వంటి అంశాలు దీనిలో ఉన్నాయి.

## నిందితులను ఎక్కువ కాలం జైళ్లోనే ఉంచాలని చూస్తున్నారా?

**- ఈడీ తీరుపై సుప్రీం అసహనం**

దర్యాప్తు పూర్తయ్యేవరకు విచారణ చేయొద్దని మీరు చెప్పలేరు. అరెస్టు కూడా చేయడానికి వీలులేదు. అనుబంధ ఛార్జిషీట్లు దాఖలు చేస్తూ.. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచలేరు" అని ఈడీ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సూచించింది.ఈ కేసులో ఓ వ్యక్తి 18 నెలలపాటు జైల్లోనే ఉన్నాడని, ఇది తమనెంతో ఇబ్బందికి గురిచేస్తోందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడిని అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలని స్పష్టం చేసింది. అయితే, సుప్రీంకోర్టు ఇలాంటి అభిప్రాయాన్ని గతంలోనూ వ్యక్తంచేసింది. దర్యాప్తు పూర్తిచేయకుండా, నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ నిరాకరించే ఉద్దేశంతో వరుస ఛార్జిషీట్‌లు దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. ఇదిలాఉంటే, సీఆర్‌పీసీ ప్రకారం, నిర్దేశించిన గడవులోగా అధికారులు దర్యాప్తు పూర్తి చేయకపోయినా, లేదా తుది ఛార్జిషీటు దాఖలు చేయని పక్షంలో అరెస్టైన వ్యక్తి డీఫాల్ట్ బెయిల్ పొందేందుకు అర్హుడు.

## తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




ప్రారంభం అయ్యింది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్‌ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్‌ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు. బీహార్‌లో నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 6తో సాధారణ ఎన్నికల ప్రక్రియ సంపూర్ణంగా ముగియనుంది. తొలి విడతలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అసోం, మహారాష్ట్ర ల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమబెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## ఎన్నికల వేళ 'ఉచితాల'పై విచారణకు సుప్రీం ఒకే..

పిటిషనర్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చే వాగ్దానాలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే దీనిపై విచారణ జరపాలని పిటిషనర్ తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. 'ఇది ముఖ్యమైన అంశం. దీనిని రేపు బోర్డు ముందు ఉంచుతాం' అని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది.రాజకీయ పార్టీలు ఇచ్చే వాగ్దానాలపై చర్యలు తీసుకునేలా ఈసీని ఆదేశించాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పథకాలపై రాజకీయ పార్టీలు ఇచ్చే అసంబద్ధ హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తాయన్నారు. ఇవి నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తాయన్నారు. రాజకీయలబ్ధి పొందే ఉద్దేశంతో ఇచ్చే ఇటువంటి ప్రజాకర్షణీయ చర్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, వీటిపై నిషేధం విధించాలని అందులో పేర్కొన్నారు. వీటిపై ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

## సొంతగూటికి తమిళిసై..

**– తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి**

**– మళ్లీ భాజపాలో చేరిన మాజీ గవర్నర్**

ఆమె పాలనా అనుభవం, ప్రజలకు సేవల చేయాలన్న తపనను కొనియాడారు. ఎన్డీయే ఈ సారి 400 సీట్లు సాధించి తీరుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. మరోవైపు తమిళిసై రాజీనామా నేపథ్యంలో తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్.. అదనంగా తెలంగాణ బాధ్యతలు స్వీకరించారు.

## మరో రెండురోజులు చల్లటి వాతావరణం

### చిరుజల్లులతో చల్లబడ్డ తెలుగు రాష్ట్రాలు

**హైదరాబాద్, మార్చి 20 (ప్రజా మంటలు):**



మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్న తరుణంలో చల్లగాలులు, చిరుజల్లులు తెలుగు రాష్ట్రాల ప్రజలను పులకరించేలా చేశాయి. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులకు ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు. మూడురోజులుగా వాతావరణం మొత్తం చల్లబడగా...మరోరెండురోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ తెలిపింది. ఝార్ఖండ్ నుంచి కోస్తా ఒడిస్సా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు సైతం కురవనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని..ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కులీలు, పశు–గొర్రెల కాపరులు చెట్ల క్రింద , బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని..సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. ఝార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉన్న ద్రోణి బలహీన పడింది. కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తుంటే...రాయలసీమలో మాత్రం ఎండ దంచికొడుతోంది. మరో రెండురోజులపాటు వేడి, ఉక్కపోత ఎక్కువ అవుతుందని వాతావరణశాఖ తెలిపింది. ల్గ÷దరాబాద్ నగరంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మార్చికి మందే ఎండలు ఠారెత్తించగా... ఇప్పుడు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో నగరవాసులు ఉపశమనం పొందారు. రాగల మూడురోజుల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

## మద్యం పాలసీ కుంభకోణం కేసు

### కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణ ఎప్రిల్ 22కు వాయిదా

**న్యూఢిల్లీ, మార్చి 20 (ప్రజా మంటలు):**
మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లను సవాల్ చేస్తూ.. ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ రెండు వారాల గడువును ఈడీకి ఇచ్చింది. తదుపరి విచారణ ఏప్రిల్ 22వ తేదీన ఉంటుందని తెలిపింది. లిక్కర్ కేసులో తొలి నుంచి ఈడీ సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోవడం లేదు. ఈలోపు ఈడీ కోర్టును ఆశ్రయించగా.. ఆయన బెయిల్ తెచ్చుకున్నారు. ఈలోపు మార్చి 21న తమ ముందు హాజరుకావాలంటూ ఈడీ నోటీసులు ఇచ్చింది. దీంతో ఈడీ నుంచి తొమ్మిదిసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు జారీ అయిన్లట్లెంది. అయితే.. ఈ సమన్లపై ఢిల్లీ సీఎం హైకోర్టును ఆశ్రయించారు. ఈడీ సమన్లు ??చట్టవిరుద్ధమైనవని, రాజ్యాంగ విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘిస్తూ జారీ చేశారని కేజ్రీవాల్తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కేజ్రీవాల్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు జస్టిస్ సురేశ్ కైత్, మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం.. చివరకు ఈడీని వివరణ కోరుతూ విచారణ వాయిదా వేసింది. అంతకుముందు లిక్కర్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఈడీ సమన్లు జారీ చేయగా.. విచారణకు హాజరు కాకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఢిల్లీ రోస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరవింద్ కేజ్రీవాల్ కోర్టుకు హాజరయ్యేలా చూడాలని కోరారు. దీంతో రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరైన కేజ్రీవాల్ బెయిల్ పొందారు. రూ.15వే వ్యక్తిగత బాండ్‌తో పాటు రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అయినప్పటికీ ఈడీ మరోసారి సమన్లు జారీ చేయడం గమనార్హం.

## కేంద్ర మంత్రి పశుపతి కుమార్ రాజీనామా..!

**న్యూఢిల్లీ,మార్చి20(ప్రజా మంటలు):**
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీలో బిగ్ షాక్ తగిలింది. బిహార్ లో లోక్ సభ ఎన్నికల్లో సీట్ల పంపకం విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ.. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ తన కేంద్ర మంత్రి పదవికి ఆయన రాజీనామా చేశారు. పశుపతి కుమార్ పరాస్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదం తెలిపారు. ఆయితే ఆయన రాజీనామాతో ఖాళీగా మారిన కేంద్ర మంత్రి పదవీ బాధ్యతలను.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగి పరాస్.. త్వరలోనే విపక్ష ఆర్జేడీ కూటమిలో చేరనున్నట్లు సమాచారం. లోక్ సభ ఎన్నికల వేళ బిహార్ లో బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ ఎన్డీయే కూటమి నుంచి ఓదొలుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం తన కేంద్ర మంత్రి పదవికి కూడా రాజీనామా చేస్తూ.. రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. పరాస్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదం తెలిపారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు పరాస్ మంత్రిత్వ శాఖ బాధ్యతలను అధనంగా అప్పగిస్తున్నట్లు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చిన పశుపతి పరాస్ త్వరలోనే ఆర్జేడీ కూటమిలో చేరి హాజీపూర్ నుంచి చిరాగ్ పై పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.పొత్తులో భాగంగా బిహార్ లో ఎన్డీయే కూటమి చిరాగా పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ (రాంవిలాస్) పార్టీకి 5 సీట్లు కేటాయించింది. దీనిపై పశుపతి ఆసంతృప్తిని వ్యక్తం చేశారు. బీహార్ లో తమకు 5 ఎంపీ సీట్లు ఉన్నాసరే పొత్తులో భాగంగా తమకు బీజేపీ ఒక్కసీటు ఇవ్వకుండా పక్కన పెట్టిందని.. దాని కారణంగానే తాను కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రధాని మోదీ ఓ గొప్ప నేత అని తాను ఎప్పుడూ.. మోదీకి రుణపడి ఉంటానన్నారు. అయితే ప్రస్తుతం పశుపతి పరాస్ ఎన్డీయే కూటమినుంచి బయటకు రావడంతో.. ఆయన బిహార్ ప్రతిపక్ష కూటమి అయిన ఆర్జేడీలో చేరాలనుకుంటే.. మేము స్వాగతం చెప్పడానికి రెడీగా ఉన్నామని ఆ పార్టీ నేత తేజ్ ప్రతాప్ యాదవ్ అన్నారు.

## రైతులంటే ఎందుకంత చిన్నచూపు?

24/7 ఫక్తు రాజకీయమేనా? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు? దెబ్బతిన్న పంటలను పరిశీలించే తీరిక లేదా? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొడుతున్న మీకు.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా? ఇంతకాలం పచ్చని పైర్లు ఎండుతున్నా.. సాగునీరు ఇవ్వడం చేతకాలేదు. ఇప్పుడు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్న మనసు రావడం లేదా? అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై భారాస పోరాడుతూనే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో మరోసారి ఏన్డీఎస్ఏ కమిటీ పర్యటన

డిజైన్స్, ప్లానింగ్, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ తదితర వివరాలు తీసుకొంది. గత పర్యటనకు కొనసాగింపుగా ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈఎన్సీ జనరల్, హైడ్రాలజీ, సెంట్రల్ డిజైన్స్ విభాగాలతో సమావేశం కానుంది. ఇంజినీర్లతో విడివిడిగా భేటీ కానున్న కమిటీ.. పదవీ విరమణ చేసిన, బదిలీ అయిన వారినీ హాజరు కావాలని పేర్కొంది.

## ఇన్‌స్టాగ్రామ్ సేవల్లో అంతరాయం

### గంట పాటు నిలిచిన ఇన్‌స్టాగ్రామ్ సేవలు

**న్యూఢిల్లీ,మార్చి20 (ప్రజా మంటలు):**
ప్రముఖ సోషల్ మీడియా వేదికైన ఇన్‌స్టాగ్రామ్‌లో అంతరాయం ఏర్పడింది. సాంకేతిక కారణం చేత సర్వీసుల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో యూజర్లు అయోమయానికి గురవుతున్నారు. సర్వీస్ అంతరాయంపై ఫిర్యాదులు చేశారు. పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పలువురికి ఇన్‌స్టాగ్రామ్ సేవలు నిలిచిపోవడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. యాప్ ఓపెన్ కావడం లేదని.. ఇమేజ్ అప్‌లోడ్ కావట్లేదని వాపోయారు. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం మందికి ఈ ఇబ్బందులు తలెత్తినట్లుగా తెలుస్తోంది. సమస్యను పరిష్కరించాలంటూ 'ఎక్స్' వేదికగా కంప్లంట్ చేస్తున్నారు. ఇటీవల కూడా సోషల్ మీడియాకు సంబంధించిన యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలు గంట పాటు నిలిచిపోయాయి. దీంతో యూజర్లంతా అసహనానికి గురయ్యారు. ఎందుకిలా జరిగిందో తెలియక కోట్లాది నెటిజన్లు హైరానా పడ్డారు. త్వరగా సర్వీసులు పునరుద్ధరించాలని పోస్టులు పెట్టారు. అనంతరం కొద్దిసేపటికే ఒక్కొక్కటిగా సర్వీసులను పునరుద్ధరించారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ సేవల్లో అంతరాయం ఏర్పడింది.

## కేజ్రీవాల్‌పై ఈడీ ఆగ్రహం

**న్యూఢిల్లీ, మార్చి 20 (ప్రజా మంటలు):**
మద్యం పాలసీ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా పదేపదే సమన్లు ??పంపడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్ పిటిషన్‌పై బుధవారం (మార్చి 20) హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీ సీఎం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అరెస్ట్ నుంచి ఉపశమనం పొందాలని కోరారు. దీనిపై ఈడీ మాట్లాడుతూ.. కేజ్రీవాల్ దర్యాప్తు సంస్థ ముందు హాజరుకాకుండా తప్పించుకుంటున్నారని, సాకులు చెబుతోందని అన్నారు. విచారణ సందర్భంగా ఢిల్లీ సీఎం వేసిన పిటిషన్ విచారణకు అర్హమైనది కాదని ఈడీ పేర్కొంది. దీనిపై రిప్లై దాఖలు చేస్తాం. దీనిపై ఇంకా సమన్లు ??ఏమైనా ఉన్నాయా అని ఈడీని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై దర్యాప్తు సంస్థ స్పందిస్తూ.. గురువారానికి సమన్లు పంపినట్లు తెలిపింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరపు న్యాయవాది సింఘ్వీ అరెస్ట్ నుంచి ఉపశమనం పొందాలని కోరారు. ప్రశ్నించే సాకుతో కేజ్రీవాల్‌ను పిలిచి అరెస్టు చేయాలని ఈడీ భావిస్తున్నట్లు ఆప్ నేతలు చెబుతున్నారు.దర్యాప్తు సంస్థ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎప్పుడు సమన్లు జారీ చేసిందని హైకోర్టు ఈడీ న్యాయవాదిని ప్రశ్నించింది. న్యాయవాది ఎస్వీ రాజు స్పందిస్తూ.. 2023 నవంబర్ 2న తొలి సమన్లు జారీ చేశామన్నారు. అయితే ఇప్పుడు ఎన్నికల నెపంతో సమన్ల నుంచి తప్పించుకునేందుకు కేజ్రీవాల్ సాకు చూపిస్తున్నారు. ఈ కేసులో పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కేజ్రీవాల్ తనను తాను ప్రత్యేక వ్యక్తిగా భావిస్తారు. తనకు ప్రత్యేక హక్కులు కావాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇప్పుడు ఈడీని సమాధానం ఇవ్వాలని హైకోర్టు కోరింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ సమస్యకు సంబంధించిన మనీలాండరింగ్ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తోంది. దీనికి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించాలన్నారు. నవంబర్ నుంచి కేజ్రీవాల్‌కు సమన్లు పంపుతోంది. తాజాగా, ఆయనకు తొమ్మిదోసారి సమన్లు పంపగా, మార్చి 21న దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాలని కోరింది.

# మార్చి మాసాంతంలో వరుస సెలవులు

## బ్యాంకులకు ఆయా రాష్ట్రాల్లో హాలిడేస్

## హోలీ కారణంగా వరుసగా మూడ్రోజులు సెలవులు

హైదరాబాద్,మార్చి20 (ప్రజా మంటలు): దేశంలో ముఖ్యమైన పండుగల్లో హోలీ ఒకటి. హోలీని దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా దేశంలోని చాలా రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఇచ్చారు. దీనికి అదనంగా మరో రెండు రోజులు, అంటే మొత్తం మూడు రోజులు సెలవులు రానున్నాయి. దేశవ్యాప్తంగా హోలీ పండుగను ఈ నెల 25న, సోమవారంనాడు జరుపుకుంటారు. దీనికి ముందు 23వ తేదీన రెండో శనివారం, 24వ తేదీన ఆదివారం కూడా బ్యాంకులు పని చేయవు. దీంతో వరుసగా 3 రోజులు సెలవులు వస్తున్నాయి. ఇకపోతే నెల 22 - 31 తేదీల మధ్య బ్యాంకులకు చాలా సెలవులు సిద్ధంగా ఉన్నాయి. బీహార్ డే కారణంగా మార్చి 22న బిహార్‌లోని బ్యాంకులకు సెలవు ఇచ్చారు. మార్చి 23న నాలుగో శనివారం, 24న ఆదివారం కారణంగా బ్యాంకులు మూతపడతాయి. హోలీ కారణంగా వివిధ రాష్ట్రాల్లో మార్చి 25, 26, 27 తేదీల్లో బ్యాంకులకు హాలిడే వచ్చింది. ఆ తర్వాత గుడ్‌ఫ్రైడే, ఆదివారం ఉన్నాయి. ఈ లెక్కన, మార్చి 22 నుంచి 31 వరకు ఉన్న 10 రోజుల్లో బ్యాంకులు 8 రోజులు మూతబడి కనిపిస్తాయి. 22 మార్చి బీహార్ డే కారణంగా పట్నాలో బ్యాంకులు మూతబడతాయి. 23 మార్చి నాలుగో శనివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంక్‌లకు సెలవు ఉంటుంది. ఈ4 మార్చి ఆదివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంక్‌లు పని చేయవు. 25 మార్చి హోలీ కారణంగా బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఇంఫాల్, కొచ్చి, కోహిమా, పట్నా, శ్రీనగర్, త్రివేంద్రం మినహా దేశంలోని బ్యాంకులకు సెలవు ప్రకటించారు. 26 మార్చి హోలీ లేదా యాయోసాంగ్ డే సందర్భంగా భోపాల్, ఇంఫాల్. పట్నాలోని బ్యాంకులకు సెలవు ఇచ్చారు. 27 మార్చి హోలీ కారణంగా పట్నాలో బ్యాంకులను మూసేస్తారు. 29 మార్చి గుడ్ ఫ్రైడే కారణంగా అగర్తల, గౌహతి, జైపుర్, జమ్ము, సిమ్లా, శ్రీనగర్ మినహా దేశంలోని బ్యాంకులకు సెలవు ప్రకటించారు. 31 మార్చి ఆదివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంక్‌లు పని చేయవు . ప్రస్తుతం, బ్యాంకింగ్ టెక్నాలజీ చాలా పెరిగింది. మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సర్వీస్‌లు ప్రజలందరికీ అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, బ్యాంక్ హాలిడేస్ పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఈ డిజిటల్ సర్వీస్‌లు 24 గంటలూ, భారతదేశం అంతటా కస్టమర్లకు అందుబాటులో ఉంటాయి.

## నేడు, రేపు భూటాన్ లో ప్రధాని మోడీ పర్యటన

## ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ

న్యూఢిల్లీ,మార్చి20 (ప్రజా మంటలు): దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగుతున్న ప్రధాని మోడీ విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. రెండు రోజుల టూర్ ఖరారైంది. మార్చి 21, 22 తేదీల్లో ప్రధాని మోడీ భూటాన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. మోడీ మార్చి 21, 22న రెండ్రోజుల పాటు భూటాన్‌లో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య సుదీర్ఘ కాలం నుంచి సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మోడీ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి సమావేశం జరగనుంది. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ.. భూటాన్ రాజు హిస్ మెజెస్టి జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్‌ను కలవనున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. అలాగే భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గేతో కూడా భేటీ అయి మోడీ చర్చలు జరపనున్నారు. ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా ముందుకు సాగనున్నారు.ఇదిలా ఉంటే భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే జనవరిలో రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తన మొదటి విదేశీ పర్యటనలో భాగంగా గత వారం ఐదు రోజుల పర్యటన కోసం ఇండియాకు వచ్చారు. టోబ్గే మార్చి 14న ఢిల్లీలో మోడీతో సమావేశమయ్యారు, ఈ సమయంలో భూటాన్‌ను సందర్శించాల్సిందిగా మోడీని ఆహ్వానించారు. ఈ ఏడాది జనవరిలో రెండోసారి ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత టోబ్గే విదేశీ పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. భారతదేశం-భూటాన్ మధ్య ప్రత్యేక భాగస్వామ్యానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తూ ప్రధాని మోడీతో చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ప్రధాని మోడీ దేశ వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్డీఏకి 400 సీట్లు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం మోడీ దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. తొలి విడతలో దక్షిణాది రాష్ట్రాల్లోనూ పోలింగ్ జరగనుంది. దీంతో ఆయన సౌతిండియాపై దృష్టి పెట్టారు.

## పాకిస్తాన్‌లో కుప్పకూలిన బొగ్గు గని 12 మంది దుర్మరణం..

బలూచిస్తాన్,మార్చి20 (ప్రజా మంటలు): పాకిస్తాన్‌లో బొగ్గు గని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మొత్తం 12 మంది కార్మికులు చనిపోయారు. దక్షిణ పాకిస్తాన్ ప్రావిన్స్ అయిన బలూచిస్తాన్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కూలిపోయిన బొగ్గు గని నుంచి బుధవారం మరో 10 మంది మైనర్ల మృతదేహాలను బయటకు తీశారు. రెస్క్యూ ముగిసిన తర్వాత మొత్తం మృతుల సంఖ్య 12గా తేలిందని అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఖోస్ట్ మైనింగ్ ప్రాంతంలో ప్రైవేట్ బోగ్గు గనిలో గ్యాస్ పేలుడు సంభవించింది. దీంతో పలువురు కార్మికులు భూమి అడుగున 800 అడుగుల కింద చిక్కుకుపోయారు. మొత్తం 12 మంది మృతదేహాలను వెలికితీయడంలో సహాయక చర్యలు ముగిశాయని బలూచిస్తాన్ ప్రావిన్స్ మైన్స్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ ఘనీ బలోచ్ చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం.. మిథేన్ వాయువు కారణంగా ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. గని ప్రమాదంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాకు తూర్పున 80 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. పాకిస్తాన్‌లో పెద్ద ప్రావిన్సు అయిన బలూచిస్తాన్ అత్యంత వెనకబడిన ప్రాంతం. జనాభా కూడా చాలా తక్కువ. అయితే ఈ ప్రాంతం విలువైన ఖనిజ నిల్వలకు కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతంలో గని నిర్వహణకు సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో తరుచుగా ప్రమాదాలు సంభవిస్తుంటాయి. మే 2018లో, అదే ప్రాంతంలోని రెండు పొరుగు బొగ్గు గనులలో గ్యాస్ పేలుళ్ల కారణంగా 23 మంది మరణించారు మరియు 11 మంది గాయపడ్డారు. 2011లో మరో బలూచిస్థాన్ కొలీరీలో గ్యాస్ పేలుళ్ల కారణంగా గని కూలిపోవడంతో 43 మంది మరణించారు.

# కాంగ్రెస్‌తో టచ్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

## చేరికలు ఖాయమన్న సంకేతాలు - ఒకటిరెండు రోజులే అంటున్న విప్




హైదరాబాద్,మార్చి20 (ప్రజా మంటలు): భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా గతంలో కెసిఆర్ అనుసరించిన విధానంలో సాగాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించడంతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేల గురించి కాంగ్రెస్ నేతలు ఒక్కో సంఖ్య చెబుతున్నారు. మరికొందరేమో బీఆర్ఎస్ఎల్పీ విలీనం అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సీఎల్పీని విలీనం చేసిన సంగతి తెలిసిందే. అందుకు కౌంటర్‌గా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేయబోతున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీతో 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఎమ్మెల్యేలు తమ పార్టీ నేతలతో చర్చలు జరిపారని, రేపో, మాపో చేరడం ఖాయం అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతోన్న ప్రజాపాలనకు ఆకర్షితులై ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేయాల్సిన అవసరం తమకు లేదని బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అందరికీ అందుబాటులో ఉంటారని, ప్రజా సంక్షేమమే తమకు ముఖ్యం అని బీర్ల ఐలయ్య వివరించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా సీఎం రేవంత్ రెడ్డి అందుబాటులో ఉంటారని వెల్లడించారు.తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 39 మంది సభ్యులు ఉన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదంలో చనిపోయిన సంగతి తెలిసిందే. ఆ స్థానానికి మే 13వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్ 38 మంది సభ్యుల్లో 26 నుంచి 30 మంది సభ్యులు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. వీరంతా కాంగ్రెస్ గూటికఇ వస్తారని అంటున్నారు. ఇప్పటికే దనాం నాగేందర్ చేరిపోయారు. మిగతావారు కూడా క్యూకడతారని అంటున్నారు.

# సిఎంగా రేవంత్‌కు తొలి పరీక్ష

**దాపాదాస్ మున్షీకి సైతం పరీక్షనే**
**పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు వీరి లక్ష్యం**

హైదరాబాద్,మార్చి20 (ప్రజా మంటలు): తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీగా దీప్ దాస్ మున్షీ , ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఎదుర్కోనున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలను ఆ ఇద్దరు నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక 14 స్థానాలు పక్కా అంటున్న కాంగ్రెస్ నేతల ఎ÷-లాన్ వర్కవుట్ అవుతుందో లేదో చూడాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నుండి పోటీ కోసం భారీ డిమాండ్ ఏర్పడింది. టికెట్ల కోసం అధిష్ఠానం చుట్టూ ఆశావాహులు చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. పక్క పార్టీల నేతలు సైతం హస్తం పార్టీ నుండి పోటీ చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. పలు పార్టీల కీలక నేతలు ఏఐసీసీ నేతలతో చర్చలు జరుపుతూ తాము ఆశించిన టికెట్ ఇస్తే కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి సిద్ధమని చెబుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇండియా కూటమిలో భాగంగా ఉన్న తమకు ఒక్కో సీటు ఇవ్వాలని సీపీఐ, సీపీఎం అడుగుతున్నట్లు సమాచారం.లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ క్రమంలో కనీసం 14 సీట్లు గెలవడమే లక్ష్యంగా పావులు కదులుతున్న కాంగ్రెస్ పార్టీ..గెలవడానికి కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. పక్కా వ్యూహంతో అసెంబ్లీ ఎన్నికల టార్గెట్ అందుకున్న విధంగానే తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే వ్యూహం అమలు పరచాలని భావిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ మొదలు పెట్టిందనే చెప్పాలి. ఫిబ్రవరి 2 న జరిగిన ఇంద్రవెల్లి బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం మోగించారు. ఇక ఆ తర్వాత జరిగిన కొస్గి సభలో పార్లమెంట్ ఎన్నికల టా÷-గ్గ÷ట్‌ను రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకే లోక్‌సభ ఎన్నికల విషయంలో అన్ని పార్టీల కంటే స్పీడ్‌గా హస్తం పార్టీ ఉంది. ఆశావహుల నుండి అప్లికేషన్లు స్వీకరించిన కాంగ్రెస్ వాటిని వడబోసే పనిలో ఉంది. అభ్యర్థుల ఎంపిక బాధ్యత పూర్తిగా రేవంత్ పై పెట్టిన అధిష్ఠానం గెలుపు గుర్రాలను సెలెక్ట్ చేయమని ఆదేశించింది. ఇప్పటికే మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించిన రేవంత్ మరో 16 మందిని కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ ప్రకటించడానికి కసరత్తు చేస్తోంది. సీట్ల ఎంపికలో గెలుపు గుర్రాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకోవాలని రేవంత్ భావిస్తున్నారు. దానిలో భాగంగా బీసీలకు నాలుగు టికెట్లు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే, కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ కొనసాగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నుండి కీలక నేతలు వరుసగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఆయన సతీమణి ప్రస్తుత వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, కార్పొరేటర్ బాబా ఫసియొద్దిన్, బొంతు శ్రీదేవి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, దానం నాగేందర్, రంజిత్ రెడ్డి,తదితరులు కాంగ్రెస్ గూటికి చేరారు. పలు పార్టీల చాలా మంది కీలక నేతలు ఏఐసీసీ నేతలతో టచ్ లో ఉన్నారని పార్లమెంట్ ఎన్నికలలోపే వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతారని సమాచారం. ఇక ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడతాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

# రాహుల్ 'శక్తి' వ్యాఖ్యలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ,మార్చి20 (ప్రజా మంటలు): ఇటీవల ముంబై వేదికగా జరిగిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇండియా కూటమి నేతలు హాజరైన ఈ మెగా ఈవెంట్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎం)లపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'శక్తి' వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు బుధవారం బీజేపీ ఫిర్యాదు చేసింది.ఫిబ్రవరి 17న ముంబైలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "హిందూ మతంలో శక్తి అనే పదం ఉంది. మేము ఒక శక్తికి వ్యతిరేకంగా పోరాడుతున్నాము" అని వ్యాఖ్యలు చేశారు. "శక్తి ఏంటంటే.. ఈవీఎంలో రాజుగారి ఆత్మ ఉంది. రాజు ఆత్మ ఈవీఎంలతో పాటు దేశంలోని ప్రతీ సంస్థలో ఈడీ, సీబీఐ, ఐటీలో ఉంది" ఈవీఎంలు లేకుండా ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల్లో గెలవలేరని కాంగ్రెస్ నేత ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. కాంగ్రెస్, ఇండియా కూటమికి హిందువులు, హిందూ ధర్మం అన్నా లెక్కలేదని, వారు హిందువులను అవమానించేందు ఎలాంటి అవకాశాన్ని కూడా వదలడం లేదని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. నిన్న తమిళనాడులో పర్యటించిన ఆయన డీఎంకే, కాంగ్రెస్ పార్టీలపై విరుచుకుపడ్డారు. మధుర మీనాక్షి, కంచి కామాక్షి తమిళనాడులో శక్తి స్వరూపాలని, శక్తిని ధ్వంసం చేస్తామని కాంగ్రెస్, డీఎంకే కూటమి అంటున్నాయని, హిందూ మతంలో శక్తి అంటే మాతాశక్తి, నారీ శక్తి అని ప్రధాని అన్నారు. ఇండి కూటమి మహిళల విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నారో అందరూ చూస్తున్నారని ఆయన అన్నారు. మహిళల పట్ల ఇండియా కూటమి వ్యవహరించే శైలికి మీ అందరూ సాక్ష్యమని, రాష్ట్ర మాజీ సీఎం జయలలిత జీవించి ఉన్నప్పుడు డీఎంకే నాయకులు ఆమెతో ఎలా ప్రవర్తించారో అందరీ తెలుసని, ఇది డీఎంకే అసలు రూపమని ఆయన అన్నారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు నాణేనికి రెండు వైపులని ప్రధాని ఆరోపించారు.

# నేను బలమైన సీఎంని..

## నీలాగా బలహీన పీఎంని కాదు

## మోడీపై సిద్ధరామయ్య విమర్శలు



శివమొగ్గ,మార్చి20 (ప్రజా మంటలు): కర్ణాటక సీఎం, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య ప్రధాని నరేంద్రమోడీ టార్గెట్‌గా విమర్శలు చేశారు. బీజేపీలో తిరుగబాటు నాయకులను అదుపు చేయలేని బలహీన ప్రధానిగా ఆరోపించారు. శివమొగ్గలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు సిద్ధరామయ్య ప్రతిస్పందించారు. " దోపిడిలో భాగస్వామ్యం కావడానికి కర్ణాటకలో పోటీ నెలకొంది. సీఎం-ఇన్-వెయిటింగ్, కాబోయే సీఎం ఆశావహులు, సూపర్ సీఎం, షాడో సీఎం ఇలా కాంగ్రెస్‌లో ఉన్నారు. చాలా మంది సీఎంల నడుమ ఢిల్లీలో కలెక్షన్ మినిస్టర్ ఉన్నారు" అంటూ కాంగ్రెస్ అధిష్టానంపై, కర్ణాటక ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.దీనికి ప్రతిస్పందనగా సిద్ధరామయ్య ఎక్స్ వేదిక ప్రధాని మోడీపై విమర్శలు చేశారు. "తిరుగుబాటు నాయకుడు ఈశ్వరప్పపై చర్యలు తీసుకోలేని బలహీన ప్రధాని అని, ప్రియమైన ప్రధాని నరేంద్ర మోదీ గారు, కాంగ్రెస్ పార్టీలో సూపర్ సీఎంలు, షాడో సీఎంలు ఉన్నారని మీరు చెప్పారు! మాకు సూపర్ లేదు, షాడో లేదు, ఒకే సీఎం ఉన్నారు. అది స్ట్రాంగ్ సీఎం, నేను మీలా వీక్ పీఎంని కాదు." అంటూ ట్వీట్ చేశారు. "మీరు మిమ్మల్ని 56 అంగుళాల ఛాతి ఉన్న వ్యక్తిగా అభివర్ణించుకుంటారు. మీ అభిమానులు మిమ్మల్ని విశ్వగురు అని కొనియాడుతున్నారు. కానీ మిమ్మల్ని మీరు మళ్లీ మళ్లీ "వీక్ పీఎం"గా చూపిస్తున్నారు" అంటూ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ఒకప్పుడు ఆయన నాయకత్వంపై తిరుగుబాటు చేశారని, దుర్భాషలాడారని ముఖ్యమంత్రి అన్నారు. అలాంటి వారి కాళ్లపై పడి, వారి మళ్లీ పార్టీలోకి తీసుకొచ్చి ర్యాలీలు నిర్వహించి, మిమ్మల్ని మీరు బలహీన ప్రధానిగా చూపించలేదా..? అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. కర్ణాటకలో మీ నాయకత్వంపై అరడజను మంది నాయకులు తిరుగుబాటు చేశారని, టిక్కెట్ల దొరక్క బీజేపీ నేతలు ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ వీధిన పడ్డారని సీఎం ఎద్దేవా చేశారు. శివమొగ్గలో మోడీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఈశ్వరప్ప ఇంటికి ఎందుకు వెళ్లలేదని అన్నారు. ఈశ్వరప్ప నిరంతరం బీజేపీ నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోలేని వారిని వీక్ పీఎం కాకుంటే ఇంకేమంటారు అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, సీఎం పదవికి అర్హులైన చాలా మంది నాయకులు ఉన్నారని, బీజేపీలో ప్రధాని అయ్యే అర్హత ఉన్న ఒక్క నాయకుడు కూడా లేదని విమర్శించారు.

# రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలు

## సెటిలర్లంతా సొంతూళ్లలో ఓట్లేస్తారా

## లెక్కలు వేసుకుంటున్న టిడిపి, వైసిపిలు



హైదరాబాద్/విజయవాడ,మార్చి20 (ప్రజా మంటలు) తెలంగాణలో ఉన్న ఓటర్లు ఆంధ్రాకు వెళ్లి ఓటేయకుండా చూడాలన్న బెంగ లేకుండా పోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకేదఫా ఎన్నికలు జరుగనుండడంతో ఇటువారు అటు..అటువారు ఇటు వచ్చి ఓటేసే చాన్స్ లేకుండా పోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒకే రోజు పోలింగ్ నిర్వహించేలా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లో ఒకే విడత పోలింగ్ జరిగితే లాభం ఎవరికి, నష్టం ఎవరికి అన్న చర్చ రాజకీయ వర్గాలలో జోరుగా జరుగు తోంది. ఈ రెండు రాష్ట్రాలకు నాలుగవ విడతలో మే 13న పోలింగ్ జరుగుతుంది. ఏపీలో పార్లమెంటుతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ, ఏపీలకు ఒకేసారి పోలింగ్ జరుగుతుండడంతో ఆంధ్రా సెటిలర్లు తమకు రాజకీయ ప్రయోజనాలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడకే వెళతార?. ముఖ్యంగా ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతుండడంతో ఆంధ్రాకు చెందిన కమ్మ, కాపు సెటిలర్లు ఎక్కడా టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి గెలుపు కోసం అక్కడకు వెళ్లి ఓట్లు వేస్తారని, వారికి చంద్రబాబు సీఎం కావడం మొదటి ప్రాధాన్యతగా ఉంటుందని చెబుతున్నారు. రాలయసీమ ప్రాంతానికి చెందిన రెడ్లు జగన్ కోసం అక్కడకు వెళ్ల ఓట్లు వేస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దీంతో ఈ రెండురాష్ట్రాల్లో ఒకే విడత పోలింగ్‌పై చర్చ జరుగుతోంది. గతంలో తెలంగాణ, ఏపీలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగేది. తెలంగాణ మొత్తం ఒక విడతలో, ఏపీ మొత్తం మరో విడతలో పోలింగ్ జరిగేది. దీంతో ఏపీ నుంచి హైదరాబాద్ చుట్టు పక్కల సెటిల్ అయిన వాళ్లు తెలంగాణ, ఏపీ రెండు చోట్ల ఓటు వేసేవారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ఓటర్ ఐడీ కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తే డూప్లికేషన్ లేకుండా పోయేది.. కానీ ఆధార్ అనుసంధానం లేక పోవడంతో రెండు, మూడు చోట్ల ఓటరుగా నమోదు చేసుకున్న వాళ్లను ఎన్నికల కమిషన్ గుర్తించలేక పోతున్నది. దీంతో అనేక మంది తాము పని చేసే చోట, తమ సొంత గ్రామం వద్ద ఇలా రెండు చోట్ల ఓటర్‌గా నమోదు చేసుకుంటున్నారు. ఇలా ఓ టరుగా నమోదు చేసుకున్న చాలా మంది సెటిలర్లు రెండు విడతలుగా పోలింగ్ జరగడంతో రెండు చోట్ల ఓట్లు వేసేవారన్న సందేహాలు ఉన్నాయి. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి నగరంతోపాటు శివారు నియోజక వర్గాలలో భారీ సంఖ్యలో సెటిల్ అయ్యారు. ఇలా జీహెచ్ ఎంసీ పరిధిలోని 25 అసెంబ్లీ నియోజక వర్గాలలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలలో వీరి పట్టు ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చి సెటిల్ అయిన వాళు చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాలలో ప్రభావితం చూపే అవకాశం ఉందని రాజకీయవర్గాలు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తూంటాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాన కారణంగా సెటిలర్లు ఓటు వేయక పోవడమేనన్న చర్చ రాజకీయ వర్గాలో జరుగుతోంది. హైదరాబాద్‌లో సెటిల్ అయిన వాళ్లలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు ఓటు వేయడానికి సొంత ఊర్లకు వెళ్లారని, ఆంధ్రా సెటిలర్లు ఇక్కడే ఓటు వేశారని, అందుకే సెటిలర్లు ఎక్కువగా బీఆరెస్‌కు ఓట్లు వేయడంతో కాంగ్రెస్ ఓడిందన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాలలో వ్యక్తమవుతోంది. ఇటీవల ఏపీలో ఓటర్ల జాబితా అంశం వివాదాస్పదం అయింది. డబుల్ ఓటర్లు ఉన్నారని వైసీపీ, ఫేక్ ఓటర్లు ఉన్నారని టీడీపీ ఆందోళనలు చేశాయి. ఈ అంశంపై న్యాయస్థానాల వరకూ వెళ్లి పోరాడారు. గతంలో తిరుపతి, బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున ఫేక్ ఓటర్లను తీసుకు వచ్చి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఫేక్ ఓటర్ల అంశంపై ఓ ఐఏఎస్ పైనా వేటు పడింది. పలువురు అధికారులపైనా వేటు పడింది. ఈ వివాదం ఇంకా కొనసాగుతోంది. అదే సమయంలో వైసీపీ హైదరాబాద్ లో ఉన్న డబుల్ ఓటర్ల గురించి ఫిర్యాదు చేశారు. అయితే దొంగ ఓటర్ల బస్సులు ఎక్కువగా వచ్చింది తమిళనాడు వైపు నుంచేనని గుర్తించారు. ఇప్పుడు కూడా తమిళనాడు..ఏపీలో ఒకేసారి ఎన్నికలు జరగడం లేదు. అందువల్ల తమిళనాడు నుంచి ఓట్లేయడానికి దొంగ ఓటర్లు వచ్చే వీలుంది. దీనిని ఇసి ఎలా అరికడుతుందో చూడాలి.

## కేరళలో టూరిస్ట్ వాహనం బోల్తా

## ఏడాది శిశువు సహా ముగ్గురు దుర్మరణం

ఇడుకి,మార్చి20(ప్రజా మంటలు): కేరళలోని ఇడుక్కి జిల్లాలోని ఆదిమాలిలో మంగళవారం తమిళనాడుకు చెందిన టూరిస్ట్ వాహనం బోల్తా పడి లోయలో పడి ఒక ఏడాది వయసున్న శిశువు సహా.. ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న మరో 13 మంది పర్యాటకులు గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం తిరునల్‌వేలి అజంతా ప్రెషర్ కుక్కర్ కంపెనీ సిబ్బంది, కుటుంబాల కోసం నిర్వహిస్తున్న ఫ్యామిలీ టూర్‌లో ఈ ప్రమాదం జరిగింది. పర్యాటకులు మున్నార్, అనకులం సందర్శించి తమిళనాడుకు తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిని 40 ఏళ్ల అభినేష్ మూర్తి, అభినేష్ ఏడాది కుమారుడు తన్విక్, 71 ఏళ్ల తేని స్థానిక గుణశేఖరన్, విశాఖ మెటల్ యజమాని ఈరోడ్‌కు చెందిన పికె సేతుగా గుర్తించారు. గాయపడిన వారిలో 11 మంది ప్రస్తుతం ఆదిమాలి తాలూకా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో ఇద్దరిని తేని వైద్య కళాశాలకు తరలించారు.

# భక్తుల కల్పతరువు ధర్మపురి నారసింహుడు



## ఫాల్గుణ శుద్ధ ద్వాదశి...నృసింహ ద్వాదశి

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



**ఫాల్గుణ శుద్ధ ద్వాదశిని నృసింహ ద్వాదశి అంటారు. నరసింహ ద్వాదశిగా ప్రసిద్ధి చెందిన గోవింద ద్వాదశి హోలీకి ముందు ఫాల్గుణ మాసంలోని శుక్ల పక్ష ద్వాదశి తిథి నాడు వస్తుంది. భారత దేశంలోని అనేక వైష్ణవాలయాల్లో ఈ రోజున విశేషంగా ఉత్సవాలు జరుపు తారు. ఫాల్గుణ మాసంలో వచ్చే నృసింహ ద్వాదశి వైష్ణవ ఆలయా లను సందర్శించడం ద్వారా శుభఫలితాలు చేకూరుతాయని సాంప్రదాయ ఆచరణాసక్తుల విశ్వాసం.**

భగవంతుని అవతారాలలో అత్యద్భుత అవతారంగా చెప్పగలిగే అవతారం నారసింహావ తారం. సగం మనిషి సగం మృగం ఆకారంలో రూపు దాల్చడం నరసింహావతార ప్రత్యేకం. దుష్ట శిక్షణ శిక్ష రక్షణ సర్వాంత ర్యామిత్వం, భక్తుని మాటను నిజం చేయడం... నమ్మిన బంటును శాప విముక్తుని గావించడం, ఎన్ని నియంత్రణలు, వరాలున్నా వాటిని అధిగమించి భక్తుడు లేక వైరి కోరుకున్న విధంగానే శత్రు వధ చేయడం, సూక్ష్మం నుండి స్థూల రూపాన్ని ఏదైనా ధరించడం నరసింహావతారంలో విశిష్టతలు.

శ్రీహరి (మనిషి జంతువు కాని) నరసింహ రూపంలో, పగలూ రాత్రిగాని సంధ్యా సమయాన, ఇంటా బయటా గాని గుమ్మంలో, భూమ్యాకాశాలు కాని తన తొడపై, హిరణ్య కశిపుని సంహరించాడు. ప్రహ్లాదుని మాటను యధార్థం చేసి, బ్రహ్మవరాన్ని గౌరవించి, తన అవతార తత్వాన్ని చాటాడు మహా విష్ణువు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కదిరి, అహోబిలం, యాదగిరి గుట్ట, సింహాచలం, మంగళగిరి, ధర్మపురి, జగ్గయ్యపేట, పాలెం, సింగరాయ కొండ, పెంచల కోన, చీర్యాల తదితరాలే గాక కర్నాటకలో మేల్కొటె, ఉడుపి, సావన దుర్గ, దేవరాయన దుర్గ తదితర నృసింహాలయాలు ప్రఖ్యాతాలు. భక్తుల కోరికలు నెరవేర్చే కల్పతరువులు.

నృసింహ ద్వాదశి పవిత్ర దినాన గంగా, సరస్వతి, యమునా, గోదావరి వంటి పవిత్ర నదులలో స్నానాలు ఆచరిస్తారు. సూర్యోదయానికి ముందే లేచి నదుల్లో స్నానాలు చేస్తారు. నదులు అందుబాటులో లేనివారు సరస్సులోనైనా, నదుల దగ్గర కూడా స్నానాలు చేయవచ్చు. అలా చేస్తున్నప్పుడు గంగా దేవి, విష్ణువులను స్మరించుకోవాలి. ఈ రోజు భక్తులు గోవింద ద్వాదశి వ్రతం ఆచరిస్తారు. ఉపవాసాలు కూడా పాటిస్తారు. ఈ రోజున భక్తులు సాయంత్రం విష్ణు దేవాలయాలను సందర్శించి పూజల్లో, ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ రోజున విష్ణు నామ స్మరణ, శ్రీ నరసింహ కవచం పఠించడం విశేష ఫలితాలనిస్తుంది. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన నరసింహస్వామిని ఈ రోజున పూజించే వారికి అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. ద్వాదశి నాటి గంగాస్నానం పాపాలను నశింపజేస్తుందని పురాణ వచనం. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం, మహిళలు సీతామాత పూజ, విష్ణుపూజ చేయడం వలన సకల సంపదలు చేకూరుతాయి.

నృసింహ ద్వాదశి వ్రతమాచరించే భక్తులకు స్వామివారు ధైర్యం, నమ్మకం, భద్రత కల్పిస్తారని విశ్వసిస్తారు. నరసింహస్వామి సంబంధిత శ్లోకాలు రోజంతా చదువుకుంటూ ధ్యానం చేస్తే విశేషంగా లబ్ది పొందుతారు. వ్రతం చేసుకునే వారు వేకువ ఝామునే నిద్రలేవాలి. పారే నదిలో కానీ చెరువులో లేదా బావి వద్ద శిరస్నానం చేయాలి.. ఇలా చేస్తే దేహంశుద్ధి అవడమే కాకుండా పూజపై మనసు లగ్నమవుతుందని పెద్దలు చెబుతారు.

నరసింహస్వామి దేవాలయంలో కానీ, ఇంటివద్ద స్వామి వారి పటం పెట్టుకొని వివిధ రకాల పూలు, పండ్లు ఉంచి నరసింహస్వామి శ్లోకాలను భక్తి శ్రద్ధలతో చదువుతూ పూజ చేయాలి. స్వామివారిని తులసిమాలతో అలంకరించి, వడపప్పు, పానకం నైవేద్యంగా సమర్పించాలి. నరసింహ గాయత్రిని కానీ, శ్రీలక్ష్మి నరసింహ కరావలంబ స్తోత్రం, నరసింహ అష్టోత్తరం, నరసింహ సహస్ర నామాలను గానీ పఠిస్తే చాలామంచిదని పురాణాలు పేర్కొంటున్నాయి.


ఉగ్రం వీరం మహావిష్ణుం
జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం
మృత్యుమృత్యుం నమామ్యహం

ఉగ్రం అంటే... నృసింహుడు ఉగ్రమూర్తి. నరసింహుని హుంకారాన్ని విన్నంత మాత్రంలోనే అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది. వీరం అంటే.. సకల కార్యకారణాలకు మూలంగా వున్న శక్తినే వీరం అంటారు. నరసిం హుడు వీరమూర్తి. కనుక సకల కార్యకారణ స్వరూపుడు ఆయనే. మహావిష్ణుం అంటే... అన్ని లోకాల్లో అంతటా వుండే నరసింహ తత్వానికి ఈ నామం ప్రతీక. సకల జీవరాశులన్నిటిలోనూ తానే వ్యక్తంగానూ, అవ్యక్తంగానూ పరమాత్మ భాసిస్తాడు. జ్వలంతం అంటే... సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయడం ద్వారా వాటి ప్రకాశానికి కారణమైన తత్త్వమే జ్వలంత శబ్దానికి అర్థం. సర్వతోముఖం అంటే... ఇంద్రియ సహాయం లేకుండా సకల విశ్వాన్ని చూడగల పరమాత్మ తత్త్వమే సర్వతోముఖత్వం. నృసింహం అంటే.. సకల జీవుల్లో సింహం చాలా శ్రేష్ఠమైనది. అందుకనే పరమాత్మ లోకాలను ఉద్ధరించ డానికి శ్రేష్టమైన సింహాకృతి ప్రధానంగా నరసింహుడుగా ఆవిర్భవించాడు. భీషణం అంటే... నరసింహుని శాసనశక్తి ప్రతీక భీషణత్వం.

అత్యంత భయంకరమైన రూపం ఇది. భద్రం అంటే.. భయాన్ని కలిగించే భీషణుడైన పరమాత్మే ఆ భయాన్ని పోగొట్టి అభయాన్ని కూడా ఇస్తాడు. ఇదే భద్రత్వం. మృత్యుమృత్యుం అంటే.. స్మరణ మాత్రం చేత అప మృత్యువును దూరం చేసేవాడు. మృత్యువుకే మృత్యువైన వాడు నరసింహుడు మాత్రమే. మృత్యువును కలిగించేదీ, మృత్యువును తొలగించేది కూడా ఆ స్వామి అనుగ్రహమే.

ఓం నమో నృసింహాయ నమః అని 108 సార్లు స్వామి వారిని ధ్యానిం చినా విశేష ఫలితం లభిస్తుంది. అలాగే ఈ రోజున నరసింహ - స్వామి వారి దేవాలయాలను దర్శిస్తే వారి కృపకు పాత్రుల వుతారు

# బీఎస్పీ అధినేత టిఆర్ఎస్ లో చేరడం సమంజసమేనా?




-వద్దేపల్లి మల్లేశం
9014206412



**బహుజన భావజాలాన్ని ఆకాశానికి ఎత్తి తప్పుకోవడాన్ని కారణం అధికారమేనా ?**
**బహుజన సమాజ మేధావుల మౌనం ఎందుకు ?**

సాంప్రదాయ రాజకీయ పార్టీలు అవకాశవాద అంశాలను ప్రాతిపదికగా చేసుకొని సందర్భానుసారంగా తమ అంశాలు, లక్ష్యాలు, ఆదర్శాలు, మేనిఫెస్టోలను మార్చుతూ ఉంటాయి. గెలుపు కోసం అధికారం కోసం పార్టీలను కూటములలో విలీనం చేస్తే మరికొన్ని సందర్భాలలో పార్టీలోని క్రియాశీల నాయకులు ఇతర పార్టీలలో చేరి అవకాశాన్ని అధికారాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తారు . దేశవ్యాప్తంగా ఇదే తీరు కొనసాగుతుంటే మరింతగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎన్నికల ముందు ఇలాంటి వికృత చేష్టలను ఎక్కువగా చూడవచ్చు. ద శాబ్దాల తరబడి ఒక పార్టీలో కొనసాగి ఎన్నికల్లో టిక్కెటు రానంత మాత్రాన వెంటనే మరొక పార్టీకి మారడం ఒక విషయం అయితే, ఎన్నికల్లో ఓటమి పాలై ప్రజల ఆగ్రహానికి గురై చావు తప్పి కన్ను లొట్ట పోయిన రీతిలో బలహీనమైన పార్టీని వీడి ప్రజల పక్షాన పనిచేయడానికి అనివార్యంగా పార్టీ మారక తప్పడం లేదని మరికొందరు ఇతర పార్టీలలో చేరుతున్నారు. ఈ సన్నివేశానికి ఉదాహరణగా టిఆర్ఎస్ పార్టీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత జరిగిన సమీక్షల్లో కార్యకర్తలు నాయకులే నిందించిన సందర్భాన్ని పురస్కరించుకొని అనేకమంది ఇతర రాజకీయ పార్టీలలో చేరుతున్నట్లు మనం గమనించవచ్చు. అయితే ఇటీవల ప్రధానంగా చర్చకు వచ్చిన అంశం గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్ ఎస్ పి బీఎస్పీ అధినేతగా కొనసాగి బహుజన ఉద్యమాన్ని భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి కొంత ఊపును తెచ్చిన సందర్భాన్ని మనము కాదనలేము.

కానీ అదే సందర్భంలో నిరంతరము అనేకసార్లు విమర్శించి నిందించినటువంటి బిఆర్ఎస్ పార్టీతోని ఒప్పందం కుదుర్చుకోవడం పొత్తులో భాగంగా అధినాయకత్వం నుండి వ్యతిరేకత వచ్చింది అనే పేరుతో పార్టీకి రాజీనామా చేసి మార్చి 18,2024 సోమవారం రోజున కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్ లో చేరిపోవడం సర్వత్రా చర్చనీయాంశం కావడం వెనుక బలమైన కారణం లేకపోలేదు. పోలీస్ అధికారిగా కొనసాగడంతో పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రత్యేక అధికారిగా ఆ పాఠశాలల ఉత్తమ ఫలితాలకు విద్యార్థుల క్రమశిక్షణకు నైతిక విలువలకు అంకితభావంతో పని చేసిన అధికారిగా గుర్తింపు ఉన్న ప్రవీణ్ కుమార్ భవిష్యత్తు సర్వీస్ను వదిలిపెట్టి బిఎస్పి లో చేరి, ఏకాకి అధ్యక్షునిగా బాధ్యతలు, స్వీకరించి రెండున్నర సంవత్సరాల పాటు బహుజనులలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన మాట వాస్తవమే.

అయితే సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లేదని ఒకే వర్గం వారి చేతిలో నాయకత్వం ఉందని కొందరు విమర్శించినప్పటికీ అగ్రవర్ణ ఆధిపత్యం ముందు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే క్రమంలో పేద మధ్యతరగతి దళిత అట్లడుగు ఆదివాసి బహుజన వర్గాలకు తోడుగా ఉన్న మాట కూడా వాస్తవం. అదే సందర్భంలో అధికారంలో ఉన్నటువంటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి అవలంబించి బహుజనుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించడం కోసం కొన్ని సభలు సమావేశాలతో భరోసా నింపినప్పటికీ ఆ ముచ్చట మూన్నాళ్ల పర్వంగానే మిగిలిపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

**రాజీనామా ఎందుకు చర్చనీయాంశం అయింది ?**

సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చు కోవడంతోపాటు మెజారిటీ వర్గాల ప్రయోజనం కోసం లక్ష్యాత్మకంగా పనిచేసే క్రమంలో ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని పనిచేయవలసినటువంటి సందర్భంలో బహుజన సమాజ్ పార్టీని జనంలోకి తీసుకురావడం, రెండున్నర సంవత్సరాల పాటు నాయకత్వం వహించి సామాన్య ప్రజల చెంతకు తీసుకువెళ్లడం , గతంతో పోల్చినప్పుడు కొంత ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు .ప్రజలకు భరోసానిచ్చి ప్రభుత్వాలను ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించి ఎదురొడ్డి పోరాడినటువంటి అధినేతగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు బి ఆర్ ఎస్ తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అది నాయకత్వం రద్దు కోరి నందుకు నిరసనగా రాజీనామా చేసి, టిఆర్ఎస్ లో చేరడం చర్చనీయాంశం కాక మరేం అవుతుంది. ఇంతకాలం నమ్ముకున్నటువంటి ప్రజలను బహుజనులను పక్కదారి పట్టించినట్లా? లేక గందరగోళానికి గురిచేసినట్లా? అని విశ్లేషకులు అభిప్రాయపడుతుంటే నమ్ముకున్న ప్రజలు బహుజనులు కొంత ఆందోళనకు గురైన మాట వాస్తవమే . ఈ సందర్భంలో క్రింది స్థాయిలో ఉన్న పార్టీ శ్రేణులు కార్యకర్తలు సందిగ్ధంలో ఉంటే మరికొందరు రాష్ట్రస్థాయి నాయకులు అధినేత దారిలోనే టిఆర్ఎస్ లో చేరడాన్ని బట్టి ఒక ఎత్తుకు ఎదిగిన బహుజన సమాజ్ పార్టీని ఈ రాష్ట్రంలో దారి మళ్లించినట్లుగానే కనిపిస్తున్నది. సిద్ధాంత ప్రాతిపదిక లేని రాజకీయ పార్టీలను ఎవరు విశ్వసించరు కానీ బహుజన సిద్ధాంతం ప్రాతిపదికగా సంపూర్ణంగా విశ్వసించి నాయకత్వ వహించి ఒక్కసారి పార్టీ మారడం అంటే అందులో ఓటమిపాలై అధికారాన్ని కోల్పోయి, ప్రజల ఆగ్రహానికి గురై, ప్రవీణ్ కుమార్ బి ఆర్ ఎస్ లో చేరడం ఆయన వివేకాన్ని ప్రశ్నిస్తుంది.

ఇది ఆ పార్టీ వ్యక్తిగత అంశమే కావచ్చు కానీ పబ్లిక్ లో నిలబడినప్పుడు ఏ రాజకీయ పార్టీని అయినా ప్రజలు నిలదీసి విమర్శించే అధికారం ఉంటుంది. కనుకనే ఇవాళ ప్రజలందరూ ఈ అంశాన్ని బహిరంగంగా చర్చించుకుంటున్నారు . దళిత బంధు వంటి పథకాన్ని గత ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు ఇది దళితులను మభ్యపెట్టడమేనని, అవినీతి ఆదిపత్య ధోరణి ,పేద వర్గాల బహుజనుల అభ్యున్నతికి టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలు ఆటంకము కలిగిస్తున్నాయని అనేకసార్లు విమర్శించినటువంటి ప్రవీణ్ అదే పార్టీలో చేరడం, వారు జీర్ణించుకోగలరేమో కానీ ప్రజలుగా నిరంతరము బహుజన ఉద్యమంలో పరిశీలించి కలిసిపోయి ఆచరించినటువంటి ప్రజలు అంగీకరించలేకపోతున్నారు.

టిఆర్ఎస్ పార్టీ కూడా 2001లో ఏర్పడిన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన ఉద్యమ పార్టీ అని గొప్పగా చెప్పుకున్నప్పటికీ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే పార్టీ నాయకత్వం ఆరోజే ఇది ఉద్యమ పార్టీ కాదని పూర్తిగా రాజకీయ పార్టీ అని ప్రకటించడాన్ని బట్టి సాంప్రదాయ పార్టీల వలెనే సిద్ధాంతాలు కలిగిన పార్టీలు కూడా ఇలా ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయడం అంటే బాధాకరమే. ఈ సందర్భంలో ముఖ్యంగా బహుజన పార్టీకి సంబంధించినటువంటి శ్రేణులు నాయకులు ప్రజలు ఇలాంటి సందర్భంలో ఎక్కడికక్కడ స్పందించాలి. ఉద్యమం ఏరకంగా బలపడింది ? ప్రస్తుతం నాయకత్వ రాజీనామా వల్ల పార్టీకి జరిగిన నష్టం ఏంటి ? ఈ నష్టాన్ని పూడ్చుకోవడం ఎలా ? అధినేతగా ఉండి రాజీనామా చేసిన సందర్భాన్ని ఎలా చూడాలి? అనే అంశం పైన లోతుగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది.

అదే సందర్భంలో ఓటమిపాలైన పార్టీలో, నిందించిన పార్టీలోనే తిరిగి చేరడం ఎవరి ప్రయోజనాల కోసం ? ఇప్పటికే క్రమక్రమంగా ఖాళీ అవుతూ కార్యకర్తలు నాయకుల విమర్శలకు గురవుతున్న టిఆర్ఎస్ పార్టీలో చేరడం అంటే దాని వెనుక ఉన్న ప్రయోజనాలు ఏమిటో వేచి చూస్తే కానీ అర్థం కాదు. అయినా సిద్ధాంతాలకు కట్టుబడి సమర్థతతో పనిచేసినటువంటి నాయకులు ఇలాంటి సందర్భాలలో పార్టీలు మారినప్పుడు మాత్రమే ప్రత్యేకంగా చర్చ జరిగే అవకాశం ఉంటుంది. ఆ కోవలోని వారే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు కావడ మే చర్చ జరగడానికి మరింతకారణమయ్యింది.

**(వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకుడు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట తెలంగాణ )**

## రచయితలకు, కవులకు ఆహ్వానం

**కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన "నేటి కథ" శీర్షిక మళ్ళీ ప్రారంభిస్తున్నాం. అలాగే కవితలను కూడా వారంలో ఒక రోజు ప్రచురించనున్నాం. మీ రచనలను, సామాజిక స్పృహతో, నేటి తరానికి మన సంస్కృతి, వారసత్వాన్ని అందించే కథలకు, కవితలను ఆహ్వానిస్తున్నాం. మీ కాలానికి పదను పెట్టి, సమాజాన్ని తీర్చిదిద్దే రచనలను సృష్టించాలని, తార్కిక, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా, సామాజిక అంశాలను కథావస్తువుగా తీసుకొని రచనలు చేయాలని మా విజ్ఞప్తి. మీ రచనలను ఈ కింది ఈ మెయిల్ కు పంపండి. మీ రచనతో పాటు హామీని, మీ పూర్తి చిరునామాను, ఫోటో ను కూడా జతచేయడం మరవకండి. మీ రచనలను వర్డ్ డాక్యుమెంట్, పేజ్ మేకర్ 7.0 ఓపెన్ ఫైల్ గా మాత్రమే పంపండి. కథలను 400- 500 ల పదాలకు పరిమితం చేస్తే బాగుంటుంది.**

**ఇక మీదే ఆలస్యం ..**

Email :
mantalukathalu@gamil. Com

ఎడిటర్.

# ఒక్కో అడుగు..అభివృద్ధి వైపు పరుగు !

వందరోజుల పాలనలో సిఎం రేవంత్ రెడ్డి హామీల అమలుకు చేస్తున్న కృషి అభినందనీయం. అవే ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఫలిస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తాయి. ప్రధానంగా తెలంగాణలో ఓ రకంగా చెప్పాలంటే అవినీతికి తావు లేకుండా..స్వేచ్ఛకు భంగం కలగకుండా చూసుకుంటు న్నారు. ఇదే పద్ధతిలో పోతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తే రేవంత్ రెడ్డికి ఢోకా ఉండదు. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నంతలో రేవంత్ అభివృద్ధికి కసరత్తు చేస్తూనే ఉన్నారు. ఎందుకంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవస్థలను కూల్చింది. అప్పులకుప్పగా చేసింది. జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఈ క్రమంలో అధికారం చేపట్టిన రేవంత్ నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది. అయితే అప్పుల గురించి, అవినీతి గురించి ప్రజలు ఆలోచించకుండా...చర్చించకుండా ఉండేలా..బిఆర్ఎస్ కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ఎలా అమలు చేస్తారని పొద్దున లేచింది మొదలు విమర్శలకు దిగుతు న్నారు. గ్రామాల్లో ప్రజలు ఛీత్కరించుకుంటున్నా.. పట్టించుకోవడం లేదు. తాజా పరిణామాలను గమనిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కక పోవచ్చు. ఇవన్నీ చక్కదిద్దుకుంటూనే వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా సిఎం రేవంత్ అడుగులు వేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ముందుచూపు తో ప్రజల సహకారంతో సుస్థిర అభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకోగలిగింది. అన్ని వర్గాల సంక్షేమం, అన్ని రంగాల అభివృద్ధికి ఆలంబనగా నిలిచేలా ప్రయత్నాలు మొదలు పెట్టింది. తెలంగాణ అభివృద్దే లక్ష్యమని హామీనిచ్చిన.. మేరకు ప్రభుత్వం అదే దిశగా అడుగులు వేస్తున్నది. ఎన్నికల హామీల అమలు, అభివృద్ధి, సంక్షేమం, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక అంశాల మీద సిఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఆయన వేస్తున్న అడుగులే ఇందుకు నిదర్శనంగా చూడాలి. అయితే అంతకు మించిన అవలక్షణాలు ఇప్పుడు బిఆర్ఎస్‌లో బయటపడడం ప్రజల్లో ఉన్న భరోసాను కోల్పోతోంది. ప్రధానంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పత్రాల లీకేజీ, గతంలో ఇంటర్ పరీక్షల విధానం, ధరణి సమస్యలు, ప్రాజెక్టుల నిర్వాసితుల పట్ల నిరంకుశ వైఖరి వంటివన్నీ బిఆర్ఎస్ అనుసరించిన ఈ విధానాల పట్ల ప్రజల్ల తీవ్ర ఆగ్రహం ఉంది. ఇవన్నీకూడా కావాలని చేసినట్లుగా ఉండడంతో బిఆర్ఎస్ నిర్లక్ష్యాన్ని ప్రతిఫలించింది. ఇలాంటి సందర్భాల్లో కఠినంగా వ్యవహరించిన ధాఖలాలు లేవు. అందుకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకుంది. కెసిఆర్ అప్పులు చేసి అవి ప్రజలకు తెలియకుండా..ఆస్తులు సృష్టించామని చెబుతూ వచ్చారు. సంక్షేమ పథకాల రూపకల్పనలో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని బాకాలు ఊదారు. రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకమంటూ లేదని ఊరూవాడా ప్రచారం చేసుకున్నారు.. తెలంగాణ ఏర్పడక ముందున్న పరిస్థితులను పోలిస్తే గతంలో కన్నా మెరుగైన విధంగానే అభివృద్ధి, సంక్షేమం కోసం తీవ్రంగా కసరత్తు జరుగుతోందన్న భ్రమలు కల్పించారు. మంచిని మంచిగా.. చెడును చెడుగా చూడాలన్న భావనతో విశ్లేషిస్తే గానీ అసలు నిజాలు బయటపడలేదు. అందుకే గత పాలనకు భిన్నంగా రేవంత్ రెడ్డి తన వందరోజుల పాలనలో అభివృద్ధి సంక్షేమాలకు సమప్రాధాన్యమిస్తూ ముందుకుపోతున్న విధానాన్ని ఆచరణలో ప్రతిఫలించింది. ఆదాయ వనరులు పడిపోయిన పరిస్థితుల్లో కూడా మున్నెన్నడూ లేనిస్థాయిలో ఇచ్చిన హామీల అమలుతో ప్రజలకు అండగా ప్రభుత్వం నిలిచింది. ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నది. నిధుల కేటాయింపుల్లో సర్వజన సంక్షేమం కనిపిస్తున్నది. గ్రామీణ ఆర్థిక వికాసం లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రోత్సహించేదిగా ఉంటున్నాయి. విద్య, వైద్య రంగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం కనిపిస్తున్నది. మూసీ సుందరీకరణ, మెట్రో రైలు, రీజినల్ రింగ్‌రోడ్‌లాంటి వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణకు తగిన ప్రాధాన్యం లభించింది. సమాజంలోని అన్నివర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న దనడానికి చేపట్టిన కార్యక్రమాలను నిదర్శనంగా చూడాలి. వెనుకబడిన, నిమ్న వర్గాల అభ్యున్నతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. మహిళలకు వడ్డీలేని రుణాలు మొదలు బీసీలు, ఎంబీసీల కోసం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు. అభివృద్ధికోసం అవసర మైన నిధులతో అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. ఇకపోతే రైతులకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చింది. సాగునీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. మొత్తంగా అభివృద్ధికి వెనకడుగు వేసేది లేదని నిరూపించు కునేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం హ్వానించదగ్గ పరిణామంగా చూడాలి. పేపర్ లీకేజ్ గత ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలపై ఉక్కు పాదం మోపాలి. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచిందన్న భావన వచ్చేలా కృషి జరగాలి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రెఫరెండమని సిఎం రేవంత్ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ కూడా మొదలు పెట్టారు. మంచి చేస్తే ప్రజలు ఎప్పుడూ గుండెల్లో పెట్టుకునే చూస్తారు. ఈ ఒక్కటి గ్రహించి ముందుకు సాగితే తిరుగు ఉండదు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి



ఎల్కతుర్తి మార్చ్ 20 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల కేంద్రంలో గ్రామీణ పేదలకు 6 గ్యారంటీలను అమలు చేయాలి. పట్టణ పేదలకు ఉపాధి హామీ పని పెట్టాలి. బి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డిమాండ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఏఎల్ఏడబ్ల్యూ యు- జిల్లా వర్క్ షాప్ ఎల్కతుర్తి ఆఫీసులో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బి ప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన, 6 గ్యారంటీల అమలుకు, తెల్ల రేషన్ కార్డు ఉంటేనే, లబ్ధిదారులను గుర్తిస్తామని, తెలంగాణ ప్రభుత్వం చెప్పడం, ఆందోళనకరంగా ఉందని, అన్నారు. గత 10 ఏళ్ల పాలనలో ఒక కార్డు కూడా పేదలకు ఇవ్వలేదని, ఈ కాలంలో ఎదిగి వచ్చిన పిల్లల పేర్లు, పాత రేషన్ కార్డులలో నమోదు చేసే అవకాశం కూడా లేకుండా చేశారని అన్నారు. ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు, ఇండ్ల జాగ పట్టాలు ఇచ్చి, పేదలకు 15000 రైతు భరోసా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి రాజుల రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప, జిల్లా కమిటీ సభ్యురాలు లోకిని స్వరూప, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన సైదల వంశీ (23) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వందరోజుల పాలనలో సాధించిందేమీ లేదు

### ఢిల్లీకి మూటలు మోయడంలోనే నేతల బిజీ
### మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



నల్లగొండ, మార్చ్ 20 (ప్రజామంటలు):
వంద రోజుల కాంగ్రెస్ పాలనలో వసూళ్లు, దందాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. సీఎం స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు వసూళ్లకు పాల్పడుతూ ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గర్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఏడుస్తుంటే ఏ ఒక్క మంత్రికి, ఎమ్మెల్యేలకు సోయలేదన్నారు. రెండు తడులు నీళ్లు అందిస్తే పంటలు గట్టెక్కేవి, కానీ, జిల్లా మంత్రులకు ఆ ఆలోచన లేదన్నారు. రైస్ మిల్లర్లను, క్రషర్ ఓనర్లను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా మంత్రులు ఇసుక దందాలో తలమునకులయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ప్రభుత్వ పరంగా ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదని మండిపడ్డారు. కింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## పోషణ పక్షంలో బాగంగా పోషణ్ భీ, పడాయి భీ
## బాల్యారంభ దశ అవగాహన కార్యక్రమము



గొల్లపల్లి మార్చ్ 20 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండలంలోని రంగధామునిపల్లి కొస్నపల్లి అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్షం కార్యక్రమాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బాల్య రంభ దశ ప్రాముఖ్యత అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కార్నర్స్ ఏర్పాటు చేసి అంగన్వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పూర్వ ప్రాథమిక విద్యకు మంచి అలవాట్లు సంభాషణ కథ పాట సంసిద్ధత వర్కు బుక్స్ సృజనాత్మక కార్యక్రమాలు శాస్త్రీయ పరిజ్ఞానం అక్షర పరిచయము అంకెలపరిచయం నర్సరీ ఎల్కేజీ యూకేజీ మొదలైన కార్యక్రమాలపై తల్లులకు పూర్వ ప్రాథమిక విద్య యొక్క బాల్యారంబదశ ప్రాధాన్యత స్వదేశీ బొమ్మల ప్రాముఖ్యత పై తల్లులకు అవగాహన కలిగించనైనది. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకొనవలసిన ఆహారము అలవాట్ల గూర్చి ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా చూపిస్తూ వారికి పోషకాహారం పైన అవగాహన గర్భిణీ స్త్రీలు గర్భం ధరించి నుండి పది నుంచి 12 కిలోల బరువు పెరగవలనని రక్తహీనత వల్ల కలిగే నష్టాలు ప్రతిరోజు ఒక గంట విశ్రాంతి తీసుకొనవలెనని ఐయఫ్ఏ టాబ్లెట్స్ రోజు ఒకటి చొప్పున వేసుకొని బీట్రూట్ తప్పకుండా తీసుకొనవలెనని ఆకుకూరలు కూరగాయలు గింజ ధాన్యాలు, చిరుధాన్యాలు, బెల్లము, పల్లీలు ప్రతిరోజు ఆహారంలో వాడవలెనని అవగాహన కలిగించడమైనది. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన కార్య క్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత ,హెల్త్ సూపర్వై జర్ తార, ప్రధానోపాధ్యాయురాలు హేమ, ఏఎన్ఎమ్ చిలుకమ్మ, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, రాజేశ్వరి ,ఆశా వర్కర్ రమ, గర్భవతులు బాలింతలు పిల్లలు పాల్గొన్నారు.




## భువనగిరిలో పోటీకి దిగిన సిపిఎం

హైదరాబాద్, మార్చ్ 20 (ప్రజామంటలు):
తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేయాలని సీపీఎం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జహంగీర్ పేరును ఆ పార్టీ ప్రకటించింది. మిగిలిన 16 స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామని ఆ పార్టీ తెలిపింది. దీంతో ఆశావహులు టికెట్ల కోసం పార్టీ పెద్దలను ఆశ్రయిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సిపిఎం ఒంటరిగానే పోటీ చేసింది. ఖమ్మంలో పోటీ చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిపాజిట్ కోల్పోయారు. సిపిఐ మాత్రం కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా నిలబడి గెల్చింది. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలను నిర్వహించనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు.

ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు.

## పాలిసెట్ మే24కు వాయిదా

హైదరాబాద్, మార్చ్ 20 (ప్రజామంటలు):
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ను వాయిదా వేస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం మే 17న పాలీసెట్ నిర్వహించాల్సి ఉన్నది. ఎంట్రెన్స్ టెస్ట్‌ను మే 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి కార్యదర్శి ఏ పుల్లయ్య తెలిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తెలంగాణలో నాలుగో విడుతలో ఎన్నికలు జరుగనున్నాయి. నాలుగో విడుతలో మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనున్నది. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చింది.




## హెచ్-1బీ రిజిస్ట్రేషన్ గడువు పొడగింపు

న్యూఢిల్లీ, మార్చ్ 20 (ప్రజామంటలు):
భారతీయులు సహా ఎంతో మంది వృత్తి నిపుణులు ఆశగా ఎదురు చూసే అమెరికా హెచ్-1బీ వీసా ధరఖాస్తు పెట్టుకోవడానికి ఈ నెల 22 తో గడువు ముగియనుంది. ఈ విషయాన్ని అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వెల్లడించింది. విదేశీ నిపుణులు నియమించుకునేందుకు యూఎస్ కంపెనీలకు అనుమతించే ఈ వీసాలకు ఎక్కువగా పోటీ ఉంటుంది. అమెరికా టెక్ కంపెనీలు ఎక్కువగా భారత్ , చైనా వంటి దేశాల నుంచి వేలాది మంది ఐటీ నిపుణులను నియమించుకుంటారు. ఇండియా ఐటీ నిపుణుల్లో విపరీతమైన గిరాకి ఉన్న ఈ వీసా కోసం మార్చి 6న రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. విదేశి ఉద్యోగులు అమెరికాలో పనిచేసేందుకు అనుమతించే హెచ్ 1బీ వీసా కోసం ఐ-129, ప్రీమియం ప్రాసెసింగ్ కోసం ఐ-907 వంటి ఫారంను నింపవలసి ఉంటుంది. అభ్యర్దులు ఆన్ లైన్ లో యూఎస్ సీబీఎస్ వెబ్ సైట్ ద్వారా రిజిస్టేషన్ చేసుకోవచ్చు. వాటికి సంబంధించిన ఫీజును ఆన్ లైన్ లో సమర్పించవచ్చని వివరించింది. హెచ్ -1బీ క్యాప్ పిటిషన్లకు ఆన్ లైన్ లో ఫారాల దాఖలు ఏప్రిల్ 1 నుంచి స్వీకరిస్తామని పేర్కొంది. ప్రతి సంవత్సరం 65,000 హెచ్1బీ వీసాలను మంజూరు చేస్తారు. దీనినే హెచ్ -1బీ క్యాప్ అంటారు. మరో 20,000 వీసాలను యూఎస్ లోని మాస్టర్ ఆఫ్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు.

# దేవాలయానికి ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే కడియం





వేలేరు మార్చ్ 20 (ప్రజామంటలు):
వేలేరు మండలం పీచర గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో పిచర పెద్దమ్మ తల్లి గుడికి 50,000 రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది.
బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మరిజే నరసింగరావు, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్, గుజ్జుల రాంగోపాల్ రెడ్డి, పీచర గ్రామ శాఖ అధ్యక్షులు మారబోయిన రాజు, రఘునాయకుల ప్రమోద్ రెడ్డి, బైర బోయిన గట్టయ్య, కో ఆప్షన్ మొహమ్మద్ జానీ, సమ్మక్క చైర్మన్ కొయ్యడ మహేందర్, బాలవికాస వాటర్ ప్లాంట్ అధ్యక్షులు ఎడపల్లి సిద్దులు మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, రఘు నాయకుల శ్రీధర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు గుడి కందుల రాకేష్, గాలి మల్లికార్జున్, నకిర్త మధు, మరిజే ప్రసాద్ ఈడ బోయిన నవీన్, గద్దే శంకర్రావు, ఏకుల పరుశురాములు, భైరబోయిన శ్రీనివాస్, అంబి రంజిత్, మనోహర్, ఎండి ఇమామ్, శ్రావణ్, శ్యామ్, రాజయ్య ముదిరాజ్ అధ్యక్షులు అల్ల రమేష్, ఉపాధ్యక్షులు ఎలబాక కనకరాజు, పిట్టల యాదగిరి, పోలు తిరుపతి, పోలు నాగరాజు, వెంగళ సమ్మయ్య, బొల్లి రాజు, కంకణాల రాజు, పిట్టల నాగరాజు, ఎడ్ల అనిల్, పోలు సతీష్, ఎడ్ల శ్రీకాంత్, ముదిరాజు యూత్ అధ్యక్షులు వొద్దుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ గేట్లు తెరువడం కాదు

## రైతుల కోసం ప్రాజెక్టుల గేట్లు తెరువండి
## బిజెపి మండల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్



భీమదేవరపల్లి మార్చ్ 20 (ప్రజామంటలు): చేతికి వచ్చిన పంట, సాగునీరు లేక పంట ఎండిపోతుంటే, రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టుల గేట్లు తెరువకుండా, పార్టీ గేట్లు తెరిచామంటూ ప్రత్యర్థి ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ఏంటని మండల బిజెపి అధ్యక్షులు పైడిపల్లి పృథ్వీరాజ్ ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును బావి నీళ్లతో ట్రయల్ రన్ చేసి ప్రజలను నమ్మిస్తే, ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. మంత్రి పొన్నం కూడా లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తా, పారిస్తా అని ఉత్త ముచ్చట్లు చెబుతూ, హుస్నాబాద్ నియోజక వర్గ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గౌరెల్లి ప్రాజెక్ట్ ఏలా నింపుతారో ప్రజలకు తెలపాలని అన్నారు. ఇప్పటివరకు కాలువలు లేకుండా సాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి పక్క పార్టీ నేతల కోసం గేట్లు తెరిచాం అని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ లాల సందీప్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, ప్రధాన కార్యదర్శులు గుండెల్లి సదానందం, శ్రీరామోజు శ్రీనివాస్, మోలుగు సంపత్, వేముల ప్రసాద్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ను కలిసిన
## గీత విద్యాలయం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు): పట్టణం లోని గీత విద్యాలయం వాకర్స్ అసోసియేషన్ మరియు విద్యాలయ యాజమాన్యం గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ని కలిసిన గీత విద్యాలయం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యాలయ యాజమాన్యం వినతిపత్రం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గీత విద్యాలయం చుట్టూ ఉన్న చెత్తను మరియు ప్లాస్టిక్ కవర్స్, పిచ్చి చెట్లను సిబ్బందిచే తొలగించాలని చైర్పర్సన్ ని కోరారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

## వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించిన
## మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

హుస్నాబాద్ మార్చ్ 20 (ప్రజామంటలు):
కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డెపల్లి వెంకటరమణ కూతురు శ్రీజ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి వెంకటరమణ ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం శ్రీజ చిత్రపటానికి పూలు వేసి, నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరి వెంట టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్ వల్లపు రాజు, అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, నగేష్, మంగ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



## పేద యువతి పెళ్ళికి భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి చేయూత



జగిత్యాల / రంగాపూర్ మార్చ్ 20 (ప్రజామంటలు): సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన “పాంపర్తి జ్యోతి - కీ.శే. రాజేశం ల కూతురు “చందన”అనే పేద యువతి వివాహం నిశ్చయం అయ్యింది. కాని వారు ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉండి నాన్న లేకపోవడం మరియు ఎటువంటి ఆధారం లేక పోవడం వలన వారి బంధువులు మరియు ఆ గ్రామ సర్పంచ్ గారు మన సత్యసాయి సంస్థ దృష్టికి తీసుకురావడం జరిగింది, అలాగే వీలైన సహాయం అర్థించడం జరిగింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల ఆధ్వర్యంలో సంస్థ ద్వారా తక్షణమే స్పందించి భక్తులందరి ఆర్థిక సహకారంతో అమ్మాయి వివాహం నకు కావలసిన వస్తువులైన దాదాపు 8,000 రూపాయల విలువ గల ఒక పెళ్లి చీర, మంగళ హారతి సెట్, కన్యాదాన తాంబూలం మరియు చెంబు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, 25 కెజీల బియ్యం, నూనె టిన్, పప్పులు, కారం, మసాలా లాంటి తదితర వస్తు సామాగ్రిని అందచేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, వంగల లక్ష్మీనారాయణ, పిప్పరి ఆంజనేయులు మరియు మహిళా సభ్యులు జయశ్రీ, శ్రీలత, చంద్రకళ, లక్ష్మి, లక్ష్మీదేవిపల్లి గ్రామ సర్పంచ్ పాంపర్తి లక్ష్మి పాల్గొన్నారు.

## గృహ జ్యోతి పథకంకు సంబంధించి కలెక్టర్ కు 35 వ వార్డ్ కౌన్సిలర్, హనుమండ్ల జయశ్రీ విన్నపం



జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు):
ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి పథకం కొరకు ప్రజాపాలన దరఖాస్తులలో కొంత మంది తెల్లరేషన్ కార్డు ఉండి కూడ 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులైన దరఖాస్తులో టిక్ చేయకుండా, యు.ఎస్.సి. నెంబర్ వేయక వారికి "0" బిల్లు రాలేదు వీళ్ళు ఇప్పుడు వచ్చిన బిల్లు కట్టాలా? వద్దా? మరియు కొంత మంది యు.ఎస్.సి. నెంబర్ వేయకుండా మీటర్ నెంబర్" వేయటం వల్ల వీరికి '0' బిల్లు రాలేదు. వీళ్ళు కూడ బిల్లు కట్టాలా? వద్దా ? మరికొంత మంది యు.ఎస్.సి. నెంబర్ కరెక్ట్ వ్రాసిన సిస్టమ్ లో టైపు చేసినప్పుడు తప్పు కొట్టడం వల్ల '%శీ%' బిల్లు రాలేదు వీళ్ళు కూడ కట్టాలా? వద్దా? ఇటు వంటి సమస్యల గురించి ప్రజలు ఏం చేయలో అర్థం కాక మున్సిపల్ ఆఫీస్ చుట్టూ మరియు ఎలక్ట్రిసిటి ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. మున్సిపల్ అధికారులు "ఎడిట్ ఆప్షన్" మాకు ఇవ్వలేదు ప్రభుత్వం, ఆప్షన్ ఇచ్చే వరకు మేము ఏమి చేయలేము అంటున్నారు. కరెంటు అదికారులు మాది ఏమి లేదు. వాళ్ళు మున్సిపల్ లోనే చేసుకోవాలి అని చెపుతున్నారు. ప్రజలు ఆందోళనతో ఆఫీస్ ల చుట్టూ తిరిగి తిరిగి బేజారవుతున్నారు. మీరు మున్సిపల్ అధికారుల ద్వారా పేపర్ ప్రకటన విడుదల చేసినట్లయితే ఎవరు కట్టాలి? ఎవరు కట్టవద్దు? అనే సమాచారం ప్రజలకు చేరుతుంది. కావున అనే వివరాలు ప్రజలకు తెలియచేయాలని పట్టణ ప్రజలందరి పక్షాన జగిత్యాల మున్సిపల్ 35 వ వార్డ్ కౌన్సిలర్, హనుమండ్ల జయశ్రీ కోరారు.

## ఫాలూదా ఐస్ క్రీం లో మానవ వ్యర్థాలు కలిపి అమ్ముతున్న నిర్వాహకుడిపై కేసు

### దేహశుద్ధి చేసిన స్థానికులు

### అసభ్య పనులకు పాల్పడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్

హనుమకొండ మార్చి 20 (ప్రజామంటలు):
వరంగల్ జిల్లా నెక్కొండ లో అంబేద్కర్ సెంటర్లో కూల్ఫీ ఐస్ క్రీమ్ శీతల పానీయాల వ్యాపారం చేసే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం తన బండి వద్ద బహిరంగంగా అసభ్యంగా చేతితో చేయరాని పనిని చేస్తూ తన ఐస్ క్రీం బండి వద్ద స్థానికులకు దొరికిపోయాడు.






కస్టమర్లకు ఐస్ క్రీమ్ సప్లై చేసే క్రమంలో చెడు పదార్థం కల్పిస్తూన్నాడన్న ఆరోపణల పై అడ్డంగా బుక్కయ్యాడు. సదరు నిర్వాహకుడి అసహజమైన చర్యలను గమనించిన స్థానికులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని దేహశుద్ధి చేశారన్న విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్సై మహేందర్ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఐస్ క్రీమ్ బండి నిర్వాహకున్ని బండితో సహా పోలీస్ స్టేషన్ కి తరలించారు. దుర్వాసన వెదజల్లుతున్న ఫాలుదా ఐస్ క్రీమ్, కూల్ఫీ తదితర ఐస్ క్రీమ్ తయారీ పదార్థాలన్నీ నేలపై పారబోయించారు. సిఐ చంద్రమోహన్ మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కాలు రామ్ పూర్బియా గత కొన్ని నెలలుగా మండల కేంద్రంలో ఐస్క్రీం బండి పైన కుల్ఫీ, ఫాలుదా మొదలగు శీతల పానీయాల వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు. ఐస్క్రీం బండి వద్ద పబ్లిక్ లోనే అసభ్యంగా ప్రవర్తించడంతో అతనిపై సెక్షన్ 294 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు ఇతరత్రా చిరు వ్యాపారాలు చేసే వారు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తాము చేసే వ్యాపారం పట్ల వ్యక్తిగత శుభ్రత సామాజిక పరిశుభ్రత పాటించాలని అన్నారు. లేనిచో వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఐస్ క్రీమ్ బాక్స్ లో నుంచి సేకరించిన శాంపిల్స్ ఫుడ్ ల్యాబ్స్ కి పంపించినట్లు ఈ రిపోర్ట్స్ రావడానికి రెండు వారాల వరకు పడుతుందని తెలిపారు. రిపోర్ట్స్ వచ్చాక రిజల్ట్స్ బట్టి ఆహార పదార్థాలను కలుషితం చేసిన నిర్వాహకుడిపై మరిన్ని సెక్షన్లను నమోదు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

## అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ షేక్ హబీబ్ కుటుంబానికి పోలీస్ భద్రత చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ



జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు):
కథలాపుర్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ షేక్ హబీబ్ కుటుంబానికి జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ భద్రత పథకం కింద మంజూరు కాబడిన 8,00,000 రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. హబీబ్ కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తూ వారి కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పి శివం ఉపాధ్యాయ, బి. సెక్షన్ సూపరిండెంట్ నయీం పాల్గొన్నారు.

## నంది అవార్డు గ్రహీత ధనశ్రీ కి ఎమ్మెల్యే సన్మానం

హనుమకొండ/భీమదేవరపల్లి మార్చ్ 20 (ప్రజామంటలు): ముల్కనూర్ గ్రామానికి చెందిన నంది అవార్డు గ్రహీత రామారపు రాజు – సంధ్యరాణి ల కూతురు ధనశ్రీ కి హనుమకొండ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా ఛైర్మన్ సుందర్ రాజ్, కాకతీయ యూనివర్సిటీ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్ల శ్రీనివాస్, కొరపల్లి రాజేష్, బిర్జిగిరి శ్రవణ్, నంచర్ల రాజు, తిరుపతి, నరేందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పరి పేటలో దాసాంజనేయ స్వామి దేవాలయంకు భూమి పూజ

జగిత్యాల మార్చి 20 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణం 12 వ వార్డు ఉప్పరిపేట లో నూతనంగా నిర్మిస్తున్న "దాసాంజనేయ స్వామి " దేవాలయం భూమి పూజ శంఖుస్థాపన కార్యక్రమం లో ఎమ్మెల్సీ శ్రీ టి.జీవన్ రెడ్డి మరియు ఎమ్మెల్యే డా ఎం. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో అన్ని పార్టీల నాయకులు జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ నక్క జీవన్ లతో పాటు జగిత్యాల పద్మనాయక సంక్షేమ సంఘం అద్యక్షులు యాచమనేని వెంకటేశ్వరరావు, కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్ రావు, కోశాధికారి ఎం. దామోదర్ రావు మాజీ అధ్యక్షుడు ముప్పాల రాంచందర్ రావు, మాజీ జెడ్పిటిసి ఎం. జితెందర్ రావు మరియు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్లు గిరి నాగ భూషణం టి. విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు కొక్కు గంగాధర్, భోగ ప్రవీణ్ మరియు స్థానిక వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





ఈ సందర్భంగా ఉప్పరిపేట వెలమ సంఘం అద్యక్షులు అల్లాల భగవంత రావు, ఆలయ కమిటి సభ్యుల నుండి అల్లాల దామోదర్ రావు, అల్లాల రమేష్ రావు, నాయిని విద్యా సాగర్ రావు, కొండాడి రాజ వెంకట నర్సింగ రావు, ఆలూరి భూమ రావు, బియ్యాల సుధాకర్ రావు, అల్లాల కిషన్ రావు తదితరులు అందరిని సత్కరించారు.

## ఓల్డ్ హైస్కూల్ లో స్వీప్ ఓటర్ అవగాహన కార్యక్రమం

జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు):
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్ లో స్వీప్ ఓటర్ అవగాహన కార్యక్రమం జరిగింది విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ముగ్గులతో అలంకరించి ర్యాలీ నిర్వహించి ఓటర్ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు పై అవగాహన కలిగి ఉండాలని ఓటర్స్ ఎడ్యుకేషన్ లో భాగంగా ప్రతి ఓటర్ను భాగస్వామ్యం చేసే విధంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని 100 శాతం ఓటింగ్ చేయాలని ఎలాంటి ప్రలోభాలు లేకుండా భయం లేకుండా భేద భావం లేకుండా ఓటింగ్ చేయాలని ఓటు వేయాలని ఓటు యొక్క విలువను తెలుసుకుని ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేసి ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వి. రజిత, ఉపాధ్యాయులు బోనగిరి దేవయ్య, కె. పద్మ, ఆనందరావు, సూర్యప్రకాష్.. విద్యాదేవి, అరుణ, అనిత, సురేందర్, మల్లికార్జున్, హరిత, శ్రీనివాస్, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## కూచిపూడి కళాకారిణి 'అంజన శ్రీ' ని సన్మానించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



రాయికల్ మార్చ్ 20 (ప్రజామంటలు): రాయికల్ మండలం రామాజీపేట్ గ్రామానికి చెందిన బొమ్మకంటి అంజన శ్రీ నాలుగు సంవత్సరాల వయసులో స్కూల్ బస్సు ప్రమాదంలో ఎడమకాలు కోల్పోగా కృత్రిమ కాలు (ఆర్టిఫిషల్ లెగ్ ) తో కూచిపూడి నృత్యం నేర్చుకుంటూ జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలు చేసి అవార్డులు అందుకుంది. బొమ్మకంటి అంజనశ్రీ కి మళ్లీ కృత్రిమ కాలు (ఆర్టిఫిషల్ లెగ్) అవసరం ఉండగా బుధవారం రాయికల్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి సీఎంను కల్పిస్తానని కృత్రిమ కాలు పెట్టించే విధంగా చూస్తానని మాట ఇచ్చారు. అనంతరం అంజన శ్రీ ని సన్మానించి మునుముందు చాలా ప్రదర్శనలు ఇస్తూ ముందుకు సాగాలని ఆశీర్వదించారు. అలాగే ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు.

## శ్రీ లక్ష్మీ గణేష ఆలయంలో మూషిక మూర్తి స్థాపన

జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు):
శ్రీ లక్ష్మీ గణేష్ మందిరంలో , హంపి విరూపాక్షి, విద్యారణ్య భారతీ స్వామీ వారి ఆదేశానుసారం, ప్రముఖ జ్యోతిష్య పౌరాణిక వేద పండితులు శ్రీ మాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక చే యంత్ర స్థాపన, మూషిక మూర్తీ స్థాపన, మూల మంత్ర హవనం, బలి హరణం, పూర్ణాహుతి, అవబృత స్నానం, మంగళ హారతి, మంత్ర పుష్పం, మహాధాశీర్వచనం, అన్న ప్రసాదం తో కార్యక్రమాలు ముగిసాయి. ఈనాటి కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కోటగిరి శ్రవణ్ కుమార్, జిల్లా ప్రభాకర్, యాదగిరి మారుతీరావు, పల్లేర్ల కిషన్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





## చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలి

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల జిల్లా మార్చ్ 20 (ప్రజామంటలు):
జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం మోతే రోడ్డు లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... వరి, మొక్కజొన్న పంటలకు మద్దతుధరతో పాటు క్వింటాల్ కి 500 బోనస్ ఇవ్వాలి అన్నారు. మామిడి రైతులకు ఎకరా 25 వేల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలి. రైతు బందు విడుదల చేయాలి అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో దావా సురేష్, జెడ్పీటీసీ మహేష్, వైస్ ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, జంబర్తి శంకర్, రాజీ రెడ్డి, శేఖర్ రెడ్డి, గంగారెడ్డి, హరీష్, బాల ముకుందం, ఆరిఫ్, బిక్షపతి, లక్ష్మణ్, సతిరెడ్డి, వంశీ బాబు, ఏనుగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ను సందర్శించిన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల మార్చ్ 20 (ప్రజామంటలు):
పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డు ను మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ సందర్శించారు. బుధవారం ఉదయం డంపింగ్ యార్డ్ ను సందర్శించి, జగిత్యాల పట్టణంలోని వార్డుల్లో సేకరించిన తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి మున్సిపల్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డు కు తరలించాలన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ అక్కడ జరుగుతున్న చెత్త నుండి తడి, పొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్, ప్లాస్టిక్ రెసైక్లింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు.

## మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

మెట్టుపల్లి మార్చ్ 20 (ప్రజామంటలు):
మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలకు బుధవారం వరకు నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిందని ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకట నర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 28 న నిర్వహించే బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికల కోసం గడిచిన మూడు రోజుల్లో మొత్తం 19 మామినేషన్లు దాఖలు అయ్యాయని అన్నారు. ఈ నెల 22 వ తేదీన జరిగే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు.



## పలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ఎల్కతుర్తి మార్చ్ 20 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం), వికాస తరంగిణి ఆధ్వర్యంలో మండలంలోని గోపాల్ పూర్, చింతలపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 400 పశువులకు గర్భకోశ, గాలికుంటు, చూడి, సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు శ్రీనివాస్, వికాస తరంగిణి సభ్యులు సుభాష్ రెడ్డి, పశు వైద్య కళాశాల అధ్యాపక బృందం సభ్యులు ఉషారాణి, సురేషు, విజయలక్ష్మి, ఆనంద్, అమృత్, సంపత్ వంశీకృష్ణ, శ్రీను, రమ్య, విజయ భాస్కర్, రాజశ్రీ, అనూష, ప్రీతి, రమేష్, తేజ, పశు వైద్యాధికారులు దీపిక, రాజేష్ , సిబ్బంది వనజారాణి, వేణుగోపాల్, కనకయ్య, ఉమ, 39 మంది యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

## నోటిఫికేషన్ విడుదలతో హడావిడి మొదలు - ఆయా ప్రాంతాల్లో అధికారుల విస్తృత ఏర్పాట్లు



చెన్నై,మార్చి20 (ప్రజా మంటలు): రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ఈనెల 20న బుధవారం ప్రారంభం అయ్యింది. 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు ఆయా ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే ఉత్తర చెన్నై నియోజకవర్గంలో పోటీ చేయదలచిన అభ్యర్థులు ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, నెం.62 బేసిన్ బ్రిడ్జి రోడ్డులోని ఎన్నికల అధికారి కట్టా రవితేజ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలి. సౌత్ చెన్నై అభ్యర్థులు అడయారు, నెం 115 డాక్టర్ ముత్తులక్ష్మి రోడ్డులోని ఎన్నికల అధికారి ఎంబీ అమిత్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలి. అదే విధంగా సెంట్రల్ చెన్నై అభ్యర్థులు షెనాయ్‌నగర్ నెం.36బీ పుల్లా అవెన్యూలోని ఎన్నికల అధికారి కేజే ప్రవీణ్‌కుమార్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాలలో ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 27వ తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్లు స్వీకరించే అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే అభ్యర్థి, ఆయన మద్దతుదారులు ప్రయాణించే వాహనాలను అనుమతిస్తారు. ఎన్నికల అధికారి కార్యాలయం లోపలకు అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల అధికారి కార్యాలయాల్లోకి సిబ్బందిని తప్ప ఇతరులెవరినీ అనుమతించరు. అభ్యర్థులు తమ నామినేషన్లతోపాటు రూ.25 వేలను డిపాజిట్‌గా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాలి. ఎస్సీఎస్టీ అభ్యర్థులు వారి కులధ్రువీకరణ పత్రాలను నామినేషన్‌తోపాటే సమర్పించాలి. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం నామినేషన్ దాఖలు చేయడానికి రెండు రోజులకు ముందే బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి అభ్యర్థికి ఆయా నియోజకవర్గాలకు చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదన చేస్తూ సంతకాలు చేయాలి. అభ్యర్థులు ఇతర నియోజకవర్గాలకు చెందినవారైతే వారి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి నుంచి ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలి. గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ గుర్తులు పొందటానికి అనువుగా పార్టీ అధిష్ఠానం నుంచి ఏ, బి ఫారాలు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లతోపాటు తమ ఆస్తుల వివరాలను కూడా జత చేయాల్సి ఉంటుంది. ఇదిలావుంటే లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం అదనంగా 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు. ఒక్కో జిల్లాలో ఆహార పదార్థాల ధరలు సమానంగా లేని కారణంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం నిర్ణయించిన ధర పట్టికను మళ్లీ పరిశీలించాల్సిందిగా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేది వరకు 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించేలా ఫారాలు అందిస్తామని తెలిపారు. ఎండీఎంకే, నామ్ తమిళర్ పార్టీలకు ఎన్నికల గుర్తు కేటాయించడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బుధవారం నుంచి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈవీఎం, వీవీపాట్ ఇతర ఎన్నికల సామగ్రి విభజన పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 4 లక్షల మంది పాల్గొంటారని సత్యప్రదసాహు తెలిపారు.

# అడ్డూఅదుపులేని బంగారం ధరలు

## అంతర్జాతీయ ప్రభావం కారణమంటున్న వ్యాపారులు



న్యూఢిల్లీ,మార్చి20 (ప్రజా మంటలు): అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ సమావేశం నేపథ్యంలో డాలర్ విలువ పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి వెనక్కు తగ్గింది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,157 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలో 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం 22 కేరెట్ల ధర 420 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి 24 కేరెట్ల ధర 460 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 340 రూపాయల చొప్పున పెరిగాయి. కిలో వెండి రేటు 300 పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో ఇవాళ బంగారం, వెండి రేట్లు ఇలావున్నాయి. ల్గ÷దరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 60,800 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర 66,330 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 49,740 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో 80,300 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర 60,800 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర 66,330 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 49,740 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర 80,300 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో పసిడి ధరలు గమనిస్తే ..చెన్నైలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 61,350 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,930 కి చేరింది. కోయంబత్తూరులోనూ ఇదే రేటు అమల్లో ఉంది.ముంబయిలో 22 క్యారెట్ల బంగారం ధర ? 60,800 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,330 కి చేరింది. పుణెలోనూ ఇదే రేటు అమల్లో ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 60,950 గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 66,480 గా నమోదైంది. జైపుర్, లఖ్‌నవూలోనూ ఇదే రేటు అమల్లో ఉంది. పసిడి, వెండి, ప్లాటినం సహా అలంకరణ లోహాల ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే అనేక పరిణామాల మీద ఈ మార్పులు ఆధారపడి ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడం లేదా తగ్గడం వల్ల మన దేశంలో ధరలు మారుతుంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అలంకరణ లోహాల రేట్లు పెరగడానికి, తగ్గడానికి చాలా కారకాలు పని చేస్తాయి. ద్రవ్యోల్బణం, ప్రపంచ కేంద్ర బ్యాంకుల వద్ద బంగారం నిల్వలు, వడ్డీ రేట్ల పెరుగుదల లేదా తగ్గుదల, వివిధ జ్యువెలరీ మార్కెట్లలోని డిమాండ్‌లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో అంశాలు అలంకరణ లోహాల ధరలను ప్రభావితం చేస్తాయి.

# అమెరికాలో తెలుగు విద్యార్థి కిడ్నాప్

## హైదరాబాద్‌లో తల్లిదండ్రులకు ఫోన్ చేసి బెదిరింపులు

హైదరాబాద్,మార్చి20(ప్రజా మంటలు): అమెరికాలో మరో తెలుగు విద్యార్థి కిడ్నాప్ అయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ మహ్మద్ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. గత రెండు వారాలుగా ఆ విద్యార్థి కనిపించడం లేదు. మరోవైపు గుర్తు తెలియని వ్యక్తులు హైదరాబాద్‌లోని అబ్దుల్ మహ్మద్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.1200 డాలర్లు ఇస్తే విడిచిపెడతామని, లేదంటే కిడ్నీ అమ్మేస్తామంటూ బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓహియోలోని క్లేవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో ఇన్మర్మేషన్ టెక్నాలజీ విభాగంలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. అతడు ఈనెల 7వ తేదీ నుంచి కనిపించడం లేదని అబ్దుల్ తల్లిదండ్రులు తెలిపారు. అమెరికాలోని బాధితుడి బంధువులు క్లేవ్ ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థి ఆచూకీ కోసం అక్కడి పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. మరెవైపు అబ్దుల్ ఆచూకీ కనిపెట్టడంలో సహకరించాలని కోరుతూ బాధితుడి కుటుంబం ఈనెల 18వ తేదీన చికాగోలోని భారత కాన్సులేట్ అధికారులకు లేఖ రాసింది. మరోవైపు తనకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని అబ్దుల్ తండ్రి అహ్మద్ సలీమ్ తెలిపారు. తన కుమారుడుని విడిచిపెట్టాలంటూ రూ.1200 డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని, లేకుంటే అబ్దుల్ కిడ్నీ అమ్మేస్తామంటూ బెదిరించారని సలీమ్ వెల్లడించారు. దీంతో అబ్దుల్ మహ్మద్ తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ఘటన జరగడం 3 నెలల వ్యవధిలో తొమ్మిదవది. బోస్టన్‌లోని ఇంజినీరింగ్ విద్యార్థి అభిజిత్ పరుచూరు అదృశ్యమైన తరువాత అతడి మృతదేహం ఓ కారులో లభ్యమైన విషయం తెలిసిందే.

# తమిళనాట డిఎండికెతో అన్నాడిఎంకె పొత్తు

## అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన పళనిస్వామి



చెన్నై,మార్చి20 (ప్రజా మంటలు): తమిళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను అన్నాడీఎంకే బుధవారంనాడు ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిసామి ఈ జాబితాను పార్టీ నేతల సమక్షంలో విడుదల చేశారు. ఎన్నికల జాబితా విడుదల సమయంలో డీఎండీకేతో పొత్తును పళనిస్వామి ప్రకటించారు. పొత్తులో భాగంగా డీఎండీకే 5 స్థానాల్లో పోటీ చేయనుండగా, పుదియ తమిళగం, ఎస్‌డీపీఐలు చెరో స్థానంలో పోటీ చేయనున్నాయి. ఈ సందర్భంగా పళనిస్వామి మాట్లాడుతూ, తాము (అన్నాడీఎంకే) బలంగా ఉన్నామని నమ్ముతున్నామని, ప్రజల మద్దతు తమకే ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. సోషల్ మీడియాలో ఎవరు ఏమనుకుంటున్నారో తాము పట్టించుకోమని, ప్రజలతోనే తమ అలయెన్స్ అని చెప్పారు. అన్నాడీఎంకే తొలి జాబితాలో 16 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. చెన్నై సౌత్ నుంచి జె.జయవర్ధన, చెన్నై నార్త్ నుంచి రాయపురం మనోహర్, కాంచీపురం నుంచి ఇ.రాజశేఖర్, అరక్కోణం నుంచి ఏఎల్ విజయన్, క్రిష్ణగిరి నుంచి వి.జయప్రకాష్, అరని నుంచి జీవీ గజేంద్రన్, విల్లుపురం నుంచి జె.భాగ్యరాజ్, సేలం నుంచి పి.విఘ్నేష్, నమక్కల్ నుంచి ఎస్.తమిళ్‌మణి, ఈరోడ్ నుంచి అశోక్ కుమార్, కరూర్ నుంచి కేఆర్ఎల్ తంగవేల్, చిదంబరం నుంచి ఎం.చంద్రహాసన్, మధురై నుంచి పి.శరవణన్, థేని నుంచి వీటీ నారాయణసామి, విరుధునగర్ నుంచి పి.జయపెరుమాళ్, నాగపట్నం నుంచి జి.సూర్జిత్ శంకర్ పోటీ చేయనున్నారు. తమిళనాడులో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 19న జరుగనున్నాయి. 2019 ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 39 సీట్లకు 38 సీట్లు గెలుచుకుని విజయభేరి మోగించింది.

# లిక్కర్ స్కామ్‌లో బోయినపల్లి అభిషేక్‌కు ఊరట

## మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు





న్యూఢిల్లీ,మార్చి20 (ప్రజా మంటలు):ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న బోయినపల్లి అభిషేక్ రావుకు స్వల్ప ఊరట లభించింది. సుప్రీం కోర్టు బుధవారం అభిషేక్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అభిషేక్ భార్య అనారోగ్యంతో ఉందన్న కారణంగా ఐదు వారాల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చింది. అభిషేక్‌ను హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతించిన సుప్రీం కోర్టు.. పాస్‌పోర్టును సరెండర్ చేయాలని.. ఆయన ఫోన్ నెంబర్ ఈడీ అధికారులకు ఇవ్వాలని, అలాగే ఆయన భార్యకు హైదరాబాద్‌లోనే చికిత్స అందించాలని షరతులు విధించింది. అలాగే మిగిలిన బెయిల్ నిబంధనలను ట్రయల్ కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంటుందని తెలిపింది. ఈ సందర్భంగా.. ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్రయల్స్ జాప్యం జరిగితే నిందితులు నెలల తరబడి జైల్లోనే ఉండాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. లిక్కర్ స్కామ్‌లో 2022 అక్టోబర్‌లో అభిషేక్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## ఎకరాకు 25వేలు వెంటనే చెల్లించాలి - కరీంనగర్ ఎంపి బండి సంజయ్ డిమాండ్

సిరిసిల్ల,మార్చి20 (ప్రజా మంటలు): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. వెంటనే పంట నష్టాన్ని గుర్తించి రైతులకు భరోసా ఇవ్వాలని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కేసీఆర్ లాగా రైతులను మోసం చేయొద్దన్నారు. సిరిసిల్ల జిల్లా రైతులను ఆదుకోవాలన్నారు. అప్పులు చేసి పంటలు వేశారని.. చేతికి వచ్చే సమయానికి వర్షం పాలైందని తెలిపారు. పదేళ్లలో ఒక్క రైతుకు కూడా పంట నష్ట పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. పంటల బీమా అమలు చేయాలని.. ఎన్నికల పేరుతో కాలయాపన చేయొద్దని హితవుపలికారు. రైతులను ఆదుకోవాలని... తామూ సహకరిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు.కాగా.. రెండు రోజుల క్రితం సిరిసిల్లలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడిన విషయం తెలిసిందే. వరి కోత దశలో ఉన్న వరి పొలాలకు వడగండ్ల వానతో నష్టం వాటిల్లింది. అకాల వర్షానికి వరి పంటలు నేలరాలాయి. చేతికి వచ్చిన పంట అకాల వర్షాలకు దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు.

# సికింద్రాబాద్‌లో కిషన్ రెడ్డి ఓటమే లక్ష్యం

## దానంను అభ్యర్థిగా నిలిపేందుకు కసరత్తు - చేరికలతోనూ దూకుడు పెంచుతున్న రేవంత్



హైదరాబాద్, (ప్రజా మంటలు): రానున్న వారంత రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్లోకి మరిన్న చేరికలు ఉంటాయని భావిస్తున్నారు. ప్రధానంగా పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు చేరబోతున్నారని సంకేతాలు వస్తున్నాయి. తాజాగా చేరిన దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ పార్లమెంట్ బరిలో నిలపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం. బిజెపికి చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓటమి లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దానం నాగేందర్ అయితేనే కిషన్ రెడ్డిని ఓడించవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే తొలుత దానంను చేర్చుకునేందుకు పావులు కదిపారు.ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించి ఖరారు చేసే పనిలో రేవంత్ ఢిల్లీ వెళ్లారు. ఇప్పటివరకు కేవలం మాజీలకు మాత్రమే పరిమితమైన వలసలు సిట్టింగ్‌ల వరకు వచ్చేశాయి. రేవంత్ సర్కార్ కూలిపోతుందంటూ చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డిని అలర్ట్ చేసినట్టు కనిపిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీలు వెంకటేష్ నేత, పసునూరి దయాకర్, రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. లోక్‌సభ ఎన్నికల ముందు వారు పార్టీ మారడం అంత కలవరపెట్టే విషయం కాదు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా పార్టీ మారడం పార్టీ పెద్దలను ఆందోళనకి గురి చేస్తోంది. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్ కి ఫిర్యాదు చేశారు. మరోవైపు దానం బాటలోనే ఇంకెంతమంది ఎమ్మెల్యేలు పార్టీని వీడతారో అనే భయం బిఆర్ఎస్‌లో మొదలైంది. దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలన్న ఆలోచన కారణంగా ముందుగా పార్టీలో చేర్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునే ఉద్దేశంతో చాలా మందితో సంప్రదింపులు జరిపినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలకు ఉన్న వివిధ రకాల వ్యాపార సమస్యలు, ఇతర అంశాల ఆధారంగా కాంగ్రెస్ నుంచి వస్తున్న ఒత్తిడితో ఎక్కువ మంది పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యేల కదలికలపై బీఆర్ఎస్ హైకమాండ్ పరిశీలనచేస్తోంది. ఫిరాయిస్తారు అని అనుమానం ఉన్న ఎమ్మెల్యేలను కేటీఆర్, హరీష్ రావులు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అధికారంలో లేకపోతే ఎలాంటి బుజ్జగింపులు అయినా పని చేయడం కష్టమన్న వాదన ఉంది. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీల్ని రెండుసార్లు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ తమ పార్టీలో విలీనం చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో బీఆర్ఎస్‌కు అరకొర మెజార్టీ లభించింది. ఆ సమయంలో ఓటుకు నోటు కేసు బయటపడటంతో .. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించి.. ఇతర పార్టీల ఎమ్మెల్యేల ను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు కేసీఆర్. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించింది. దీనికి సాక్ష్యంగా 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల ద్వారా తేలిపోయింది. పార్టీ ఫిరాయించిన వారిలో ఒకరిద్దరు తప్ప అందరూ గెలిచారు. కానీ రెండోసారి భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ కేసీఆర్ మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని విలీనం చేసుకున్నారు. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించ లేదు. ఈ ఫిరాయింపు దారులంతా ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయారు. రెండు సార్లు కాంగ్రెస్ ఎల్పీల్ని విలీనం చేసుకున్నా ... తమ పార్టీ గెలిచిందని ఫిరాయింపుల ద్వారా ఏమీ జరగదని,రేవంత్ రెడ్డి సీఎంగా ఎన్నికయిన తర్వాత ప్రకటించారు. అయితే తమ ప్రభుత్వాన్ని జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. అయితే రేవంత్ రెడ్డి ఆ మాటలన్న తర్వాత కూడా ప్రభుత్వ మనుగడపై అదే పనిగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కడియం శ్రీహరి లాంటి కీలక నేతలు తరచూ లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఉండదని చెబుతున్నారు. హస్తం నేతల్ని డిఫెన్స్ లో పడేయడానికి త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అంటూ వారు చేసిన కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో తీవ్రంగా స్పందిస్తున్నారు. మానవ బాంబులు అవుతామని కూడా ప్రకటించారు. ఇప్పుడు అదే కారణం చూపించి పార్టీ నేతల్ని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తు న్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక పాడి కౌశిక్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి మరింత రెచ్చగొట్టినట్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జంపింగ్‌ల విషయంలో బీ ఆర్ ఎస్ చేసిన తప్పే మీరూ చేస్తారా అంటూ మాజీ ఎంపి వినోద్ ప్రశ్నించారు. మేము తప్పు చేశాము అని స్వయంగా ఒప్పుకున్నట్లు అయింది. కానీ ప్రభుత్వాన్ని పడగొడతాము అని నేరుగా హెచ్చరికలు జారీ చేసిన తర్వాత.. అదే బాటలో వెళ్లకుండా ఎలా ఉంటారన్నది సహజంగా వచ్చే ప్రశ్న. ప్రభుత్వాన్ని కాపాడుకోలేక పోవడం రేవంత్ రెడ్డి చేతకాని తనం అవుతుంది. ఇదే అవకాశాన్ని ఉపయోగించుకుని రేవంత్ రెడ్డి తన ప్రతాపం చూపిస్తున్నారు. అందుకే చేరికలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. మా ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నం చేస్తే ఏం చేయాలో మాకు కూడా వ్యూహం ఉందంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ చేశారు. మేము మొదలుపెడితే మీ పార్టీలో ముగ్గురు లేదా నలుగురు మాత్రమే మిగులుతారని హెచ్చరించారు. చెప్పినట్టే వలసలకు గేట్లు ఎత్తారు. ఆ విషయం స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిచింది.

# కొనసాగిన ప్రణీత్ రావు విచారణ

## పలు విషయాల్లో కూపీ లాగిన దర్యాప్తు బృందం



హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నాలుగో రోజు బుధవారం కూడా విచారణ కొనసాగింది. విచారణలో భాగంగా ప్రణీత్ రావు నుంచి దర్యాప్తు బృందం కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది ఈ క్రమంలో ప్రణీత్ రావు మరికొందరు అధికారుల పేర్లను వెల్లడించి నట్లు తెలుస్తోంది. దీంతో.. ఆ అధికారులకు నోటీసులు ఇచ్చి, వారిని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక విచారణలో ప్రణీత్ రావు..ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్, పరికరాలు తీసుకువచ్చి వాడినట్టు ఒప్పుకన్నారు. అయితే టెలిఫోన్ సర్వీసులకు సంబంధం లేకుండా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు గుర్తించారు. అందుకోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్ తెప్పించింది ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కానీ ప్రణీత్ రావు మాత్రం విచారణ ఈ ఫోన్ ట్యాపింగ్ అధికారుల ఆదేశాల మేరకు చేశానని చెబుతుండటం గమనార్హం. దీంతో ఈ కేసులో మరొకందరిక నోటీసులు, కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రణీత్‌రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ విచారణ జరగనుంది. కస్టడీ విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ పాటించడం లేదని.. కస్టడీ ముగిసిన వెంటనే జైలుకు తరలించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. అలాగే.. తనకు సరైన సదుపాయాలు కల్పించడం లేదంటూ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఇప్పటికే పోలీసుల నుంచి వివరణ కోరింది. మరోవైపు.. తనను దర్యాప్తు చేస్తున్న టీంలో ఇంటలిజెన్స్ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, అలాగే అడిషనల్ ఎస్పీ రమేష్ విచారణలో పాల్గొనకుండా ఆదేశాలు ఇవ్వాలని ప్రణీత్ రావు కోరడం గమనార్హం.



# ఐపీఎల్‌కు ముందే రింకూ ధనాధన్ ఇన్నింగ్స్

ఐపీఎల్ 2024 ప్రారంభానికి ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నాయి . అన్ని జట్లు కష్టపడి సిద్ధమవుతున్నాయి. మరోవైపు ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. మార్చి 22న చెన్నై, ఆర్‌సీబీ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కంటే ముందే టీమిండియా యంగ్ ప్లేయర్ రింకూ సింగ్ సంచలనం సృష్టించిచాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్లేయరైన (24.75 కోట్లు) మిచెల్ స్టార్క్ బౌలింగ్ లో కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. ప్రాక్టీస్ మ్యాచ్ లో ఇది జరగ్గా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. ఐపీఎల్ సన్నాహకాల్లో భాగంగా.. కేకేఆర్ టీమ్ పర్పుల్, టీమ్ గోల్డ్‌గా విడిపోయి ప్రాక్టీస్ చేశాయి. కేకేఆర్ ఈడెన్ గార్డెన్స్ మైదానంలో జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్ లో పర్పుల్‌కు స్టార్క్ సారథ్యం వహించగా.. టీమ్ గోల్డ్‌లో ఉన్న రింకూ సింగ్ అతడికి పట్ట పగలే చుక్కలు చూపించాడు. ముఖ్యంగా స్టార్క్ వేసిన ఓ ఫుల్ టాస్ బంతిని భారీ సిక్సర్ బాదాడు రింకూ.

రింకూ ధాటికి బంతి నేరుగా స్క్వేర్ లెగ్ దిశలో స్టేడియంలోకి వెళ్లి పడింది. ఈ మ్యాచ్ లో రింకూ సింగ్ 16 బంతుల్లోనే 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు స్టార్క్ 4 ఓవర్లు వేసి ఏకంగా 40 పరుగులు సమర్పించుకున్నాడు. కేవలం ఒక వికెట్ మాత్రమే తీయగలిగాడు. కాగా ఐపీఎల్‌లో రింకూ ధర కేవలం రూ. 55 లక్షలు మాత్రమే. వన్డే వరల్డ్‌కప్-2023లో సత్తాచాటిన మిచెల్ స్టార్క్ కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా రూ. 24.75 కోట్లు ఖర్చు పెట్టింది కోల్ కతా నైట్ రైడర్స్. అతను దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్‌లో పునరాగమనం చేయనున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్:**

నితీష్ రాణా, రింకూ సింగ్, రహ్మానుల్లా గుర్బాజ్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), జాసన్ రాయ్, సునీల్ నరైన్, సుయేష్ శర్మ, అనుకుల్ రాయ్, ఆండ్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్, హర్షిత్ రాణా, వైభవ్ చరోరతి, వైభవ్ చరోరతి భరత్, చేతన్ సకారియా, మిచెల్ స్టార్క్, అంగ్రిక్ష్ రఘువంశీ, రమణదీప్ సింగ్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, మనీష్ పాండే, ముజీబ్ ఉర్ రెహమాన్, గుస్ అట్కిన్సన్, సాకిబ్ హుస్సేన్.

## సుమారు గంట పాటు ఐపీఎల్ వేడుకలు

మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఎడిషన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ చెన్నైలోని ఎం చిదంబరం మైదానంలో జరుగుతుండగా, ఈ మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవ వేడుకను కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిసారీ మాదిరిగానే ఈసారి కూడా అట్టహాసంగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు బీసీసీఐ అన్ని సన్నాహాలు చేస్తోంది. ప్రారంభ మ్యాచ్ జరిగే చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ఐపీఎల్ ప్రారంభోత్సవం ప్రారంభం కానుంది. సుమారు గంట పాటు ఈ వేడుక జరగనుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఐపీఎల్ ప్రారంభ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. అలాగే ఐపీఎల్ మ్యాచ్‌లు జియో యాప్‌లో ఉచితంగా స్ట్రీమింగ్ కానున్నాయి. బాలీవుడ్ ప్రముఖ నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్లు ఏఆర్ రెహమాన్, సోనూ నిగమ్ తదితరులు ఈసారి ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొననున్నారని సమాచారం. చెన్నై, బెంగళూరు మధ్య రాత్రి 8 గంటలకు తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఓపెనింగ్ మ్యాచ్ మినహా అన్ని నైట్ మ్యాచ్‌లు రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతాయి. ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ తొలి మ్యాచ్ ఆడడం ఇది తొమ్మిదోసారి. మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీలో, %జూఖ% గతంలో 2009, 2011, 2012, 2018, 2019, 2022 మరియు 2023 సీజన్లలో ఓపెనింగ్ మ్యాచ్ ఆడింది. సార్వత్రిక ఎన్నికల కారణంగా బీసీసీఐ ఈ ఏడాది ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం, మొదటి దశలో 17 రోజుల్లో 2 డబుల్ హెడర్‌లతో సహా మొత్తం 21 మ్యాచ్‌లు జరుగుతాయి. మిగతా షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

## అదరగొడుతున్న ఎస్ఆర్?హెచ్ కొత్త సాంగ్




ఐపీఎల్ 2024 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ కొత్త పాటను రిలీజ్ చేసింది. క్యాచీ ట్యూన్ కలిగిన ఈ పాట 'సన్‌రైజర్స్ మేము బ్రో పక్కా ఇంకో రేంజ్ బ్రో..' అంటూ స్టార్ట్ అవుతుంది.. ఈ పాటలో సన్‌రైజర్స్ కొత్త సారథి పాట్ కమిన్స్, ఎయిడెన్ మార్క్రమ్, హెన్రిచ్ క్లాసెన్, ట్రవిస్ హెడ్, టీమిండియా ప్లేయర్లు భువనేశ్వర్ కుమార్, వాషింగ్టన్ సుందర్, మయాంక్ అగర్వాల్, జయదేవ్ ఉనద్కత్ తదితర ఆటగాళ్లు కొత్త జెర్సీలు ధరించి బీట్‌కు తగ్గట్టుగా డ్యాన్స్ చేశారు. సన్‌రైజర్స్ టీమ్ అభిమానుల్లో జోష్ నింపుతున్న ఈ సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. కాగా, ఐపీఎల్ 17వ ఎడిషన్ ఎల్లుండి (మార్చి 22) నుంచి ప్రారంభం కానుంది. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా జరిగే సీజన్ తొలి మ్యాచ్‌లో ఆర్సీబీతో డిఫెండింగ్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ తలపడుతుంది. ఇక, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న కేకేఆర్‌తో ఆడబోతుంది.

## దద్దరిల్లిన ఆర్సీబీ అన్ బాక్స్ ఈవెంట్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 మరో రెండు రోజుల్లో మార్చి 22న ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్?కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుఅంటు ఫుల్ జోష్?తో సిద్ధమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన అన్?బాక్స్ ఈవెంట్ లో ప్రముఖ హాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అయినా అలెన్ వాకర్ కంపోజ్ చేసిన ఆర్సీబీ యాంథమ్ ప్రేక్షకులను ఉర్రూతలు ఉగిస్తుంది. బెస్ట్ పార్ట్ ఏమిటి అంటే సాంగ్ లో లిరిక్స్ కన్నడ భాషలో కూడా కంపోజ్ చేయడం అని చెప్పాలి. ప్రస్తుతం ఈ సాంగ్ సోషల్ మీడియా వేదికగా ట్రేడింగ్ లో ఉంది. ఇక %బౌూ% 2024 రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళల జట్టు టైటిల్ దక్కించుకుంది. 16 ఏళ్ల చరిత్రలో తొలి సారి ఈ ఫ్రాంచైజీకి ఓ టైటిల్ కైవసం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ రెండో ఎడిషన్?లోనే టైటిల్ దక్కించుకుంది వుమెన్స్ టీమ్. దీంతో అన్?బాక్స్ ఈవెంట్?కు గ్రాండ్ వెల్కమ్ తో హాజరైన స్మృతి మంధాన సారథ్యంలోని మహిళల టీమ్?ను పురుషుల జట్టుని గౌరవించి వారికి గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చింది. గ్రాండ్ గా స్టార్ట్ అయిన ఆర్సీబీ అన్?బాక్స్ ఈవెంట్? అలెన్ వాకర్ సాంగ్స్ తో స్టేడియం దద్దరిల్లిపోయింది. ఆర్సీబీ.. ఆర్సీబీ అనే అరుపులతో చిన్నస్వామి స్టేడియం మొత్తం హోరెత్తించారు ఫాన్స్. అన్?బాక్స్ ఈవెంట్?కు హాజరైన వేలాది మంది ఫాన్స్ ఒక్కసారిగా ఆర్సీబీ నినాదాలతో సందడి చేశారు. ఓ దశలో స్టేడియంలో లైట్లన్నీ ఆఫ్ చేయగా.. ప్రేక్షకులందరూ మొబైల్ ఫోన్లలో ఫ్లాష్ లైట్లను ఆన్ చేసిన దృశ్యం ఆకట్టుకుంది. ఇక మార్చి 22న ఐపిఎల్ 17వ ఎడిషన్ తొలి మ్యాచ్?లో డిఫెండింగ్ ఛాంపియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఆర్సీబీ తలపడనుంది. ఈ సీజన్లో ఆర్సీబీ మెన్స్ టీం కూడా కప్ కొట్టాలి అని ఫ్యాన్స్ అంతా కోరుకుంటున్నారు.

## కేఎల్ రాహుల్ ప్రత్యేక పూజలు!

ఐపీఎల్ 2024కు సమయం ఆసన్నమైంది. మార్చి 22న 17వ సీజన్ ఆరంభం కానుంది. టోర్నీ మొదటి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. మార్చి 24న రాజస్తాన్ రాయల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. గాయం నుంచి కోలుకున్న రాహుల్.. లక్నో కెప్టెన్ హోదాలో బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ 2024లో బరిలోకి దిగే ముందు రాహుల్ ప్రత్యేక పూజలు చేశాడు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయాన్ని ఈరోజు కేఎల్ రాహుల్ దర్శించుకున్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఉదయాన్నే గుడికి వెళ్లిన రాహుల్.. భస్మా హారతి తీసుకున్నాడు. అనంతరం మహాదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. పండితుల ఆశీర్వచనాలు పొందాడు. మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న రాహుల్.. ఐపీఎల్‌లో దిగేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు సంబందించిన ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో విరాట్ కోహ్లీ కూడా ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నాడు. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ సందర్భంగా కేఎల్ రాహుల్ గాయపడ్డాడు. దాంతో ఐపీఎల్ 2023లో కీలక మ్యాచ్‌లకు దూరమయ్యాడు. రాహుల్ స్థానంలో లక్నో పగ్గాలు చేపట్టిన కృనాల్ పాండ్యా జట్టును ప్లే ఆఫ్స్‌కు చేర్చాడు. అయితే నాకౌట్ మ్యాచ్‌లో చేతులెత్తేసిన లక్నో.. ఇంటిదారి పట్టింది. తొడ కండరాల గాయానికి శస్త్ర చికిత్స చేసుకున్న రాహుల్.. వన్డే ప్రపంచకప్ 2023లో కీపర్‌గానూ రాణించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన టెస్టు సిరీస్‌లో అతడికి మళ్లీ గాయం తిరగబెట్టింది. దాంతో లండన్ వెళ్లి వైద్య నిపుణులను సంప్రదించాడు. అనంతరం ఎన్‌సీఏలో పునరావాసం పొందిన రాహుల్.. తాజాగా ఫిట్‌నెస్ సాధించాడు.

## ప్రాక్టీస్‌లో ధనాధన్ షాట్లతో మహీ అలరించాడు

ఐపీఎల్ 2024 పండుగ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. మార్చి 22న చెపాక్‌లోని ఎంఏ చిదంబరం స్టేడియంలో డిపెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య టోర్నీ మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మాత్రమే కాకుండా.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా ఆడుతుండడంతో ఫుల్ క్రేజ్ ఏర్పడింది. చెన్నై సూపర్ కింగ్స్ తన ట్రైనింగ్ క్యాంప్‌ను ఎప్పుడో ఆరంబించగా.. కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఇటీవల జాయిన్ అయ్యాడు. ప్రాక్టీస్‌లో ధనాధన్ షాట్లతో మహీ అలరించాడు. గత ఐపీఎల్ సీజన్ నుంచి ఆటకు దూరమైనా ధోనీ ఫామ్‌లోనే ఉన్నాడు. ఫాస్ట్ బౌలింగ్‌లో హెలికాప్టర్ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ధోనీ షాట్స్ చూసిన సీఎస్‌కే అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 42 ఏళ్ల ఎంఎస్ ధోనీ గతేడాది మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అనంతరం విశ్రాంతి తీసుకున్న ధోనీ.. గత మూడు నెలల నుంచి కసరత్తులు మొదలుపెట్టాడు. జార?ండ్‌లోని మైదానంలో ప్రాక్టీస్ చేశాడు. ఆపై సీఎస్‌కే ట్రైనింగ్ క్యాంప్‌లో చేరాడు. ఐపీఎల్ 2023లో పెద్దగా పరుగులు చేయని మహీ.. కెప్టెన్‌గా మాత్రం సత్తాచాటాడు. అద్భుత సారథ్యంతో చెన్నైకి అయిదో టైటిల్ అందించాడు. ఈ ఏడాది చెన్నైకి మరో టైటిల్ అందించాలని చూస్తున్నాడు.

## హసరంగ పై 2 టెస్టుల నిషేధం

శ్రీలంక కికెట్ ఆటగాడు వనిందు హసరంగకు ఐసీసీ భారీ షాకిచ్చింది. తాజగా హసరంగపై ఐసీసీ రెండు టెస్ట్‌ల నిషేధం ఐసీసీ ప్రవర్తనా నియామళి ఉల్లంఘన కింద విధించింది. ఇకపోతే తన టెస్టు క్రికెట్ రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న కొన్ని గంటలలోనే హసరంగపై వేటు పడడం హాట్ టాపిక్ గా మారింది. తాజాగా బంగ్లాదేశ్ తో జరిగిన 3వ వన్డే మ్యాచ్ లో ఫీల్డ్ అంపైర్ పట్ల హసరంగ దురుసుగా ప్రవర్తించాడు. హసరంగ తన ఓవర్ పూర్తి చేసిన అనంతరం అంపైర్ చేతి నుంచి తన క్యాప్ ను అమాంతం బలంగా లాక్కున్నాడు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చేస్తున్న 37వ ఓవర్ లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై గాను ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.8 ఉల్లంఘన కింద దీనిని నేరంగా పరిగణించింది ఐసీసీ. దీంతో హసరంగకు తన మ్యాచ్ ఫీజులో 50% కోత విధించడంతోపాటు మరో 3 డీమెరిట్ పాయింట్లను జారీ చేశారు.

## బుచ్చిబాబు సినిమా షురూ




**రామ్‌చరణ్‌తో ఆర్‌సి-16గా మొదలు తరలివచ్చిన సినీ ప్రముఖులు**



'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ ప్రాజెక్ట్ ఓకే చేసిన క్రమంలో.. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ప్రముఖ దర్శకుడు శంకర్, సుకుమార్, చిరంజీవి, అల్లు అరవింద్, బోనీకపూర్‌తోపాటు పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం రామ్‌చరణ్ మాట్లాడారు. అతిథులకు కృతజ్ఞతలు చెప్పారు. బుచ్చిబాబు రాసిన కథ తనకెంతో నచ్చిందన్నారు. ప్రేక్షకులు తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారన్నారు. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది. స్పోర్ట్స్ డ్రామాగా... గ్రామీణ నేపథ్యంలో సాగే కథతో ఈ సినిమా సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. రామ్‌చరణ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. రెహమాన్ స్వరాలు అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఆర్‌సి16గా ఇది ప్రచారంలో ఉంది. 'పెద్ది' టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. త్వరలోనే రెగ్యులర్ షూట్ మొదలు కానుంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' పనుల్లో బిజీగా ఉండగా, 'దేవర' కోసం జాన్వీ వర్క్ చేస్తున్నారు. ఈ ఓపెనింగ్ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, నిర్మాత అల్లు అరవింద్, నిర్మాత బోనీ కపూర్, దర్శకుడు సుకుమార్, హీరోయిన్ జాన్వీ కపూర్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్.. అలాగే ప్రస్తుతం రామ్ చరణ్‌తో సినిమా చేస్తోన్న డైరెక్టర్ శంకర్ వంటి ప్రముఖులెందరో హాజరయ్యారు. వీరంతా ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా రామ్ చరణ్, జాన్వీ కపూర్ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఈ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను మెగా ఫ్యాన్స్ షేర్ చేస్తూ.. టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు.

## గుంటూరు కారంతో క్రికెటర్ అశ్విన్ ఫిదా




మహేశ్‌బాబు నటించిన సరికొత్త చిత్రం 'గుంటూరు కారం'పై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించారు . ఇదొక వినోదాత్మక చిత్రమన్నారు. తనకెంతో నచ్చిందన్నారు. ప్రధాన నటీనటుల డ్యాన్స్ చూసి ఆశ్చర్యపోయానన్నారు. 'మహేశ్ నటించిన 'గుంటూరుకారం' చూడకపోతే చూడండి. ఎంటర్‌టైనింగ్ మూవీ. శ్రీలీల డ్యాన్స్ అదరగొట్టేసింది. మహేశ్‌బాబు మంచి డ్యాన్సర్. ఆయనతో కలిసి శ్రీలీల అద్భుతంగా డ్యాన్స్ చేసింది అని ఓ ఇంటర్వ్యూలో అశ్విన్ చెప్పారు. మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన మూడో చిత్రమిది. తల్లి సెంటిమెంట్‌తో యాక్షన్ డ్రామాగా దీనిని తీర్చిదిద్దారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, రమ్యకృష్ణ, జయరాం, మురళీ శర్మ, రావు రమేశ్ కీలకపాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మంచి స్పందనలు సొంతం చేసుకుంది. 'కుర్చీమడతపెట్టి' పాటలో మహేశ్‌బాబు - శ్రీలీల డ్యాన్స్ అభిమానులను ఉర్రూతలూగించింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రస్తుతం ఇది అందుబాటులో ఉంది.



## బిజీ షెడ్యూల్ కారణంగానే చిరు ఆఫర్ తిరస్కరణ

### నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ వెల్లడి



కొందరు అగ్ర హీరోలు తమ సినిమాల్లోని కీలక పాత్రకు ఫలానా నటుడైతేనే న్యాయం చేస్తారని భావిస్తారు. ఎలాగైనా వారితో నటింపజేసేందుకు ప్రయత్నిస్తారు. కానీ, కొన్ని సందర్భాల్లో అది వీలుపడదు. ఎవరినైతే యాక్ట్ చేయించాలని అనుకుంటారో వారు అప్పటికే ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండడంతో డేట్స్ ఖాళీ లేక వచ్చిన అవకాశాన్ని సున్నితంగా తిరస్కరిస్తారు. ఇలా జరగడం అన్ని చిత్ర పరిశ్రమల్లో సాధారణమేగానీ దాదాపు నాలుగేళ్ల తర్వాత.. అదే హీరో అదే నటుడికి మరో ఆఫర్ ఇవ్వగా.. ఆ యాక్టర్ తొలుత ఏ ప్రాజెక్టు వల్ల తిరస్కరించారో రెండోసారి కూడా అదే మూవీ వల్ల 'నో' చెప్పడమనేది అరుదు. టాలీవుడ్ ప్రముఖ హీరో చిరంజీవి తన సినిమాల కోసం మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను సంప్రదించగా ఆయన తిరస్కరించారు. నాటి సంగతులను పృథ్వీరాజ్ తాజాగా పాల్గొన్న ఇంటర్వ్యూలో నెమరువేసుకున్నారు. హిస్టారికల్ ఫిల్మ్ 'సైరా'లో ఓ పాత్ర కోసం చిరంజీవి నన్ను సంప్రదించారు. అందులో నటించాలనే ఆసక్తి ఉన్నా సాధ్యపడలేదు. 'సర్ నేను ఆడుజీవితం అనే లార్జర్‌దేన్ లైఫ్ సినిమా చేయబోతున్నా. కాల్షీట్లు మొత్తం దానికే కేటాయించా' అని చెబితే ఆయన పరిస్థితి అర్థం చేసుకున్నారు. కొన్నాళ్ల తర్వాత తాను హీరోగా తెలుగులో 'లూసిఫర్' రీమేక్‌ను తెరకెక్కించాలని కోరారు. 'సైరా' సమయంలో ఏదైతే సమాధానం చెప్పానో 'లూసిఫర్' విషయంలోనూ నేను అదే చెప్పడంతో ఆయన షాక్ అయ్యారు. ఆయన అడిగిన టైమ్‌కి నేను 'ఆడుజీవితం' సినిమాకి సంబంధించి వేరే పనుల్లో బిజీగా ఉండేవాణ్ని' అని పృథ్వీరాజ్ తెలిపారు. చిరంజీవిలానే రామ్‌చరణ్ జెంటిల్‌మ్యాన్ అని పేర్కొన్నారు. విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన పృథ్వీరాజ్ 'లూసిఫర్'తో దర్శకుడిగా మారారు. ఈయనకు కుదరకపోవడంతో ఆ చిత్రాన్ని చిరంజీవి హీరోగా 'గాడ్ ఫాదర్' పేరుతో డైరెక్టర్ మోహన్ రాజా తెలుగులో తెరకెక్కించారు. బతుకుదెరువు కోసం కేరళ నుంచి సౌదీకి వలసవెళ్లిన నజీబ్ అనే వ్యక్తి జీవితాధారంగా తెరకెక్కించిన చిత్రమే 'ఆడుజీవితం'. డైరెక్టర్ పదహారేళ్ల కల ఇది. ఇందులో బానిస జీవితాన్ని అనుభవించే వలస కూలీగా కనిపించనున్నారు పృథ్వీరాజ్. విదేశాలకు వలసవెళ్లిన వ్యక్తులు బతకటం కోసం ఎలాంటి కష్టాలు ఎదుర్కొంటారు? పాస్ పోర్టులు లాక్కొని వారిని బానిసలుగా ఎలా మార్చుకుంటారనేది ఈ సినిమాలో చూపించనున్నారు. 2018లో చిత్రీకరణ ప్రారంభమైనా కొవిడ్ ఇతరత్రా కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. అమలాపాల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. 'ది గోట్ లైఫ్' పేరుతో ఇంగ్లిష్‌లో విడుదల కానుంది.

## స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్'

### నటి సమంత పోస్టర్ విడుదల



ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' లాంటి విజయవంతమైన సిరీస్‌లను అందించిన రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్న మరో స్పై యాక్షన్ సిరీస్ 'సిటాడెల్'. ఇందులో వరుణ్ ధావన్, సమంత జంటగా నటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకి 'సిటాడెల్: హనీ బన్నీ' అనే టైటిల్‌ని ఖరారు చేస్తూ పోస్టర్‌ని విడుదల చేసింది నిర్మాణ సంస్థ. బాలీవుడ్ ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నిర్వహించిన ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ కార్యక్రమంలో ఈ వివరాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ...'నేనింతగా యాక్షన్ చేస్తానని ఏనాడూ ఊహించలేదు. కనీసం ఇందులో భాగమవుతానని చివరిక్షణం వరకూ అనుకోలేదు. ఈ సిరీస్ కోసం శారీరకంగా ఎంతో శ్రమించా. రాజ్, డీకే చాలా ప్రతిభావంతులు. అమెరికన్ 'సిటాడెల్'ని భారతీయ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది. 'ఇదొక అద్భుతమైన స్పై యాక్షన్ థ్రిల్లర్. ఇందులోని సన్నివేశాలు, ప్రేమకథ ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి' అని తెలిపింది సిరీస్ బృందం. కే కే మేనన్, సిమ్రాన్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ ప్రాజెక్టు అమెజాన్ ప్రైమ్‌లో త్వరలో విడుదల కానుంది.

## ఆయ్ చిత్రం నుంచి సూఫియానా సాంగ్ విడుదల



నార్నే నితిన్ , నయన్ సారిక హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆయ్'. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా బాధ్యతలను నిర్వహిస్తుండగా.. టాలెంటెడ్ యంగ్ ప్రొడ్యూసర్స్ బన్నీ, విద్యా కొప్పినీడి ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. రీసెంట్‌గా టైటిల్ రివీల్‌కు సంబంధించిన కాన్సెప్ట్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. అలాగే ఫస్ట్ లుక్ కూడా మంచి స్పందనను రాబట్టుకుంది. తాజాగా ఈ సినిమా నుండి మెలోడి ఆఫ్ ది సీజన్ అనిపించేలా 'సూఫియానా..' అనే పాటను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట ప్రస్తుతం టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ మధ్యకాలంలో సూపర్ హిట్ పాటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. 'సూఫియానా..' సాంగ్‌ను రామ్ మిర్యాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. శ్రీమణి ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు. చక్కగా అందరికీ అర్థమయ్యేలా ఈ లిరికల్ సాంగ్ ఆకట్టుకుంటోంది. అందమైన లొకేషన్స్, బ్యాగ్రౌండ్‌లో అలరించే గోదావరి అందాలు.. నార్నే నితిన్, నయన్ సారిక మధ్య కనిపిస్తోన్న కెమిస్ట్రీ ప్రేక్షకులను అలరింపజేస్తోంది. సింపుల్ కొరియోగ్రఫీలో 'సూఫియానా..' మెలోడి సాంగ్ అందరి హృదయాలను ఆకట్టుకునేలా ఉంది. 'ఆయ్' సినిమాను ప్రారంభం నుంచి సరికొత్తగా ప్రమోట్ చేస్తున్నారు. ఇది సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ డిఫరెంట్ ప్రమోషనల్ యాక్టివిటీస్ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతోన్న ఈ సినిమాకు కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా, సమీర్ కళ్యాణి సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు.

## అశ్వత్థామ బతికుంటే ఎలా?.

### షాహిద్ హీరోగా ఫాంటసీ చిత్రం

మన పురాణాల్లోని అద్భుతమైన పాత్రను ఈ ఆధునిక యుగానికి పరిచయం చేసేందుకు, థ్రిల్లింగ్ జర్నీని ప్రేక్షకులను ఇచ్చేందుకు పూజా ఎంటర్‌టైన్‌మెంట్ సిద్ధమవుతోంది. ఇంతకు ముందు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' లా.. ఇప్పుడు షాహిద్ కపూర్ హీరోగా.. ఈ మాగ్నమ్ ఓపస్‌ను సచిన్ రవి తెరకెక్కిస్తున్నారు. ఊహకు, వాస్తవాలకు మధ్య ఉండే అద్భుతమైన కథను, గాధను 'అశ్వత్థామ ది సాగా కంటిన్యూస్' తో చూపించబోతోన్నారు. 'అశ్వత్థామ ది సాగా కంటిన్యూస్' అనే ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా సినిమాగా రూపుదిద్దు కోబోతోంది. ఈ చిత్రం మహాభారతంలోని చిరంజీవి అయిన ఓ యోధుడు (అశ్వత్థామ) కథను చెప్పబోతోంది. ఇప్పటికీ అశ్వత్థామ బతికే ఉన్నారని నమ్ముతుంటారు. వేగవంతమైన సాంకేతిక పురోగతులు, అద్భుతమైన సామర్థ్యాలతో పరిగెడుతున్న ఈ ప్రస్తుత యుగంలో, అశ్వత్థామ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంటాడు అనేది ఈ చిత్రంలో చూపించబోతోన్నారు. అమరజీవిగా ఇన్ని వేల సంవత్సరాలు ఎలా బతికి ఉన్నాడు అనే పాయింట్‌ను కూడా ఇందులో చూపించబోతోన్నారని తెలుస్తోంది. ఇది గతం, వర్తమానం మధ్య జరిగే యుద్ధం అని మేకర్స్ చెబుతున్నారు. హై యాక్షన్ ప్యాక్డ్ సీన్లతో సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దబోతోన్నామని.. ఈ సీన్లు రోమాలు నిక్కబొడుచుకునేలా తెరకెక్కిస్తామని తెలుపుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత జాకీ భగ్నాని మాట్లాడుతూ.. మేము చేపట్టే ప్రతి ప్రాజెక్ట్ కేవలం వినోదం మాత్రమే కాదు.. ప్రేక్షకులకు మరిచిపోలేని ఓ అద్భుతమైన అనుభవాన్ని ఇవ్వాలని ప్రయత్నిస్తాం. ప్రేక్షకుల హృదయాలు, మనస్సులపై శాశ్వత ప్రభావాన్ని చూపించేలా ఉండాలని చూస్తాం. 'బడే మియా చోటే మియా' తర్వాత, నేను ఊహించని సినిమా చేయాలనుకున్నాను. ఇది మనందరికీ తెలిసిన కథ. ఈ కథపై ప్రస్తుత ఆధునిక కాల పరిస్థితులు, వాటి వల్ల ఆ లెజెండ్ చేయాల్సి వచ్చిన యుద్ధం ఏంటన్నది ప్రేక్షకులకు మంచి ఎక్స్‌పీరియెన్స్‌ని ఇస్తుందని తెలిపారు. దర్శకుడు సచిన్ రవి మాట్లాడుతూ.. 'నాకు అమరత్వం అనేది చాలా ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్. ఇందులో చాలా భావోద్వేగాలు, నాటకీయ దృశ్యాలను రేకెత్తించే ఆస్కారం ఉంటుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com